



టమాటా కేజీ రూ.4

కుదేలవుతున్న రైతులు

- బహిరంగ మార్కెట్లో రూ.15 వరకు విక్రయం
- కూలి ఖర్చులు కూడా రావడంలేదని ఆవేదన

కష్టపడి పండించిన టమాటాకు మార్కెట్‌లో ధర లేక రైతులు కుదేలవుతున్నారు. మార్కెట్‌లో హెచ్చు తగ్గులు, పోటీ తత్వంతో నష్టాలను చవిచూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.15 పలుకుతున్న టమాటాలను మేము మాత్రం కిలో రూ.4లకే అమ్ముకోవాల్సి వస్తుందని కన్నీరు పెట్టుకుంటున్నారు. కూలి ఖర్చులు కూడా రాని పంట ఎందుకని పలువురు రైతులు పంట పొలాలను దున్నేస్తున్నారు. 8

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు
- కలెక్టర్ బాలాజీ 8లో

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు
- ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్

రంగ.. రంగా!

మల్లవల్లిలో ప్రైవేటు వెంచర్ కబ్జా


మల్లవల్లిలో ఆక్రమణకు గురైన వెంచర్

2014లో ప్లాట్లుగా అమ్మిన భూమిని 2018లో పొలంగా కొన్నట్లు డాక్యుమెంట్

చక్రం తిప్పిన వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి రంగా!

- రోడ్డున పడ్డ ప్లాట్ల కొనుగోలు బాధితులు
- డబుల్ రిజిస్ట్రేషన్లు ఎలా సాధ్యమని ఆవేదన
- కూటమి ప్రభుత్వమే న్యాయం చేయాలని వేడుకోలు

ప్రైవేటు వ్యక్తుల భూముల కబ్జాలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ అనుచరులు గురువుకు తగ్గ శిష్యులుగా నిరూపించుకుంటున్నారు. 2014లో వెంచర్ వేసి ప్లాట్లుగా అమ్మిన భూమిని 2018లో పొలంగా కొన్నట్లు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి కబ్జా చేశారు. ఉద్యోగ విరమణ సమయంలో వచ్చిన సొమ్మును దాచుకుని కొన్న ప్లాట్ల యజమానులను రోడ్డున పడేశారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు దిగారు. ఈ మొత్తం వ్యవహారంలో వంశీ ప్రధాన అనుచరుడు ఓలుపల్లి రంగా చక్రం తిప్పినట్లు తెలిసింది. వీరికి ఎదురు తిరిగే శక్తిలేని బాధితులు న్యాయం కోసం ప్రభుత్వ అధికారులు, న్యాయస్థానాల చుట్టూ తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని వేడుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి, గుణదల /హనుమాన్ జంక్షన్ రూరల్: గన్నవరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరుల భూదందాలు ఒక్కొక్కటిగా వెలుగు చూస్తున్నాయి. తాజాగా బాపులపాడు మండలం మల్లవల్లి గ్రామ పరిధిలో వసంతాడ రత్తయ్య కుమారుడు సాంబశివరావు అనే వ్యక్తి సాయితేజ ఇన్‌ఫ్రా హైలెట్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 2014లో వెంచర్ వేసి ప్లాట్లను సేల్‌కు పెట్టారు. ఆ కంపెనీకి సాంబశివరావు ఛైర్మన్‌గా ఉన్నారు. ఆయన కుమారుడు దినేష్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. వీరు వేసిన వెంచర్‌లో శ్రీగంధం మొక్కలు వేసి పెంచి తద్వారా వచ్చే లాభాలను ప్లాట్ల యజమానులకు ఇస్తామని చెప్పడంతో కొద్ది కాలంలోనే ప్లాట్లన్నీ అమ్ముడుపోయాయి. శ్రీగంధం చెట్లను పెంచి పెద్ద చేసినందుకు గాను 12 సంవత్సరాలకు వచ్చే లాభంలో 30 శాతం తాము తీసుకుని మిగిలిన 70 శాతం ప్లాట్ల యజమానులకు ఇస్తామని చెప్పి 10 రూపాయల స్టాంప్ పేపర్ మీద ఓ అగ్రిమెంట్ కూడా రాసి ఇచ్చారు. ప్లాట్ల సేల్స్ ప్రక్రియ పూర్తయిన కొద్ది రోజులకే వసంతాడ సాంబశివరావు అనారోగ్య కారణాలతో మరణించారు.


ప్లాట్లు కొనుగోలు చేసిన బాధితులు

2018లో దొంగ డాక్యుమెంట్ పుట్టించి..

మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ప్రధాన అనుచరుడు రంగా తన వద్ద ఉండే మేదరమెట్ల శివాజీ, మరికొందరి పేర్ల మీద ఆ వెంచర్ మొత్తాన్ని పొలంగా కొన్నట్లు 2018లో డాక్యుమెంట్ పుట్టించారు. దాని ఆధారంగా వెంచర్‌కు చుట్టూ ఫెన్సింగ్ చేసి వెంచర్లో ఉండాల్సిన శ్రీగంధం మొక్కలను తొలగించి వాటి స్థానంలో ములగ మొక్కలు నాటి వ్యవసాయం చేసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న ప్లాట్ల యజమానులు ఒక్కొక్కరుగా వెంచర్ వద్దకు చేరుకుని ఇదేమిటని ప్రశ్నిస్తే 'ఇందులోకి అడుగుపెట్టే హక్కు మీకు లేదు. నాకు అమ్మేశారు' అని శివాజీ సమాధానం చెప్పడంతో వారంతా నివ్వెరపోయారు. ఈ పొలం నాదే అనడానికి కోర్టు నుంచి ఇంజక్షన్ ఆర్డర్ కూడా ఉందనడంతో ఆందోళన చెందారు. తమకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేసిన సాంబశివరావు తనయుడు దినేష్‌ను దీనిపై నిలదీస్తే అతని మిగతా 6లో..

రంగానే చక్రం తిప్పాడు

తాము కొనుగోలు చేసిన వెంచర్‌లోని ప్లాట్లన్నింటిని మరొకరి పేరు మీదకు మా ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ చేయించిన వ్యవహారంలో వంశీ అనుచరుడు రంగా చక్రం తిప్పాడు. రంగా అనుచరుడే ఈ శివాజీ. 2014లో మాకు రిజిస్ట్రేషన్ చేసిన ప్లాట్లను తిరిగి 2018లో మరొకరికి ఎలా రిజిస్టేసన్ చేస్తారు. ఈ విషయంపై రెవెన్యూ సదస్సులో అధికారులకు మొరపెట్టుకున్నా ప్రయోజనం లేదు. శ్రీగంధం మొక్కలు పెంచుతామని చెప్పి ప్లాట్లు కొనుగోలు చేసిన 175 మందికి ఒక ఎగ్రిమెంట్ కూడా అప్పట్లో రాసి ఇచ్చారు. ఈ విషయమై ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకుని న్యాయం చేయాలి. -భూపతిరెడ్డి, బాధితుడు

ఉద్యోగ విరమణ సొమ్ముతో కొన్నాం

ఉద్యోగ విరమణ చేసిన సమయంలో వచ్చిన సొమ్ముతో పాట్లు కొన్న వారే బాధితుల్లో ఎక్కువ మంది ఉన్నారు. పిల్లలకు ఉపయోగ పడతాయనుకుంటే మొత్తంగా మా సొమ్ము మట్టి పోతుందనుకోలేదంటూ ప్లాట్ల యజమానులు కన్నీరు పెట్టుకుంటున్నారు. ఒక్కో ప్లాటును రూ.8 లక్షలు వెచ్చించి కొంటే 12 సంవత్సరాల తర్వాత శ్రీగంధం మొక్కల ద్వారా వచ్చేలాభం మొత్తంగా కలిపి రూ.35 లక్షల వరకు చేతికి వస్తుందని చెప్పడంతో ప్లాట్లను కొన్నామని వారంతా వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని ప్లాట్ల యజమానులు వేడుకుంటున్నారు.

వేగంగా..



విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంపై ప్రభుత్వం దృష్టి

జూన్ నాటికి ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ పూర్తికి చర్యలు

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ పనుల్లో వేగం పెంచడంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. జూన్ నాటికి ఎట్టి పరిస్థితుల్లో పనులు పూర్తి చేయించాలని నిర్ణయం తీసుకుంది. పనులు ఆలస్యం కావడంతో మరో సంస్థకు కాంట్రాక్టు ఇవ్వాలన్న డిమాండ్ వచ్చినా పాత సంస్థ ఎన్‌కేజీనే కొనసాగించాలని భావిస్తోంది. పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన ప్రణాళికలను రచిస్తోంది.

- పనులు ఆలస్యమవ్వడంతో.. మరో సంస్థకు అప్పగించాలన్న ఆలోచన
- చివరకు కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీనే కొనసాగిద్దామని నిర్ణయం!
- ఏప్రిల్ నాటికి అందుబాటులోకి రానున్న నూతన ఏటీసీ టవర్

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.540 కోట్ల అంచనా వ్యయంతో నూతన ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్ నిర్మాణానికి గత టీడీపీ ప్రభుత్వంలో భూమి పూజ నిర్వహించారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వంలో టెండర్లను పిలిచారు. పనులు దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీ నిర్మాణ పనులు ప్రారంభించింది. ఈ టెర్మినల్ బిల్డింగ్ పనులను గత వైసీపీ ప్రభుత్వం ఒక్క రోజు కూడా సమీక్షించలేదు. దీంతో రెండేళ్లలో పూర్తి చేయాల్సిన టెర్మినల్ బిల్డింగ్ పనులు నేటికీ పూర్తికాలేదు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం దీనిపై సీరియస్‌గా దృష్టి సారించింది. ఇందులో భాగంగా పలు ఆలోచనలను చేసింది. కాంట్రాక్టు సంస్థ ఎన్‌కేజీని సాగనంపి మరో కొత్త సంస్థకు పనులు అప్పగిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన చేసింది. అయితే ప్రస్తుత కాంట్రాక్టు సంస్థను సాగనంపాలంటే కనీసం ఏడాది సమయం పడుతుంది. దీనికంటే సదరు సంస్థతో పని చేయించుకోవటం మేలన్న ఆలోచనకు వచ్చింది. ఎన్‌కేజీ సంస్థపైనే ఒత్తిడి పెంచి పనులు వేగంగా జరిగేలా చర్యలు చేపట్టాలని భావిస్తోంది. ఎట్టి పరిస్థితుల్లో జూన్ నాటికి పనులు పూర్తి చేసేందుకు ప్రభుత్వం మిగతా 6లో..


నిర్మాణంలో ఇంటిగ్రేటెడ్ టెర్మినల్

అదనంగా ప్రవేశపెట్టిన విమానాలన్నీ ఫుల్

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం పరిధిలో అదనంగా ప్రవేశపెట్టిన విమానాలన్నీ ఫుల్ రష్‌గా నడుస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన ఆరు నెలల్లో కొత్తగా ముంబాయికి ఒకటి, వైజాగ్‌కు రెండు, ఢిల్లీకి రెండు, హైదరాబాద్‌కు ఒకటి చొప్పున అదనంగా విమానాలను ప్రవేశపెట్టారు. ఇవన్నీ కూడా 95శాతం ఆపైన ఆక్యుపెన్సీతో నడుస్తున్నాయి. ఇటీవల విశాఖపట్నానికి నడుపుతున్న రెండు అదనపు విమానాలు కూడా మంచి ఆక్యుపెన్సీతో ప్రయాణిస్తున్నాయి.

చురుగ్గా ఏటీసీ టవర్ నిర్మాణం

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో నూతనంగా చేపడుతున్న ఏటీసీ(ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్) టవర్ ఏప్రిల్ నాటికి పూర్తి కానుంది. ఇది అందుబాటులోకి రాగానే పాత ఏటీసీ టవర్‌ను తొలగిస్తారు. కొత్త ఏటీసీ టవర్‌లో సేఫ్టీ ఆపరేషన్స్ నిర్వహిస్తారు. నూతన టవర్ వెనుక చేపడుతున్న టెక్నికల్ బ్లాక్ పనులు కూడా 63 శాతం మేర పూర్తయ్యాయి. ఈ బ్లాక్‌లో కమ్యూనికేషన్స్ అండ్ నేవిగేషన్స్ వ్యవస్థలను కూడా ఏర్పాటు చేస్తారు.


ఏటీసీ టవర్

జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరు

- ప్రజలు దుస్తులూడదీసి ఆయనను ఇంట్లో కూర్చోబెట్టారు
- తప్పులు ప్రశ్నిస్తారనే అసెంబ్లీకి రావడం మానేశారు
- మంత్రి కొల్లు రవీంద్ర

8లో

సహజ నిక్షేపాలు కొల్లగొడుతున్నాయ్

- ఓఎన్జీసీ, మేఘా సంస్థలపై భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థుల ఆగ్రహం

8లో

నేటితో ముగియనున్న వీరమ్మ తిరునాళ్లు 6లో

ఉలికిపాటు

మచిలీపట్నంలో జీబీఎస్ కేసు నమోదు

సర్వజన ఆస్పత్రిలో బాధితుడికి చికిత్స

- ఆరోగ్యం నిలకడగానే ఉందంటున్న వైద్యులు
- జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తం


బాధితుడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : గులియన్ బారే సిండ్రోమ్ (జీబీఎస్) కేసు మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో నమోదు కావడంతో కృష్ణాజిల్లా ఒక్కసారిగా ఉలిక్కిపడింది. ఇటీవల కాలంలో గుంటూరు జిల్లాలో జీబీఎస్‌తో ఒకరిద్దరు మరణించారనే వార్తలు వెలువడ్డాయి. తాజాగా జిల్లాలోనూ జీబీఎస్ లక్షణాలతో మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో ఒక వ్యక్తి చికిత్స పొందుతున్నట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత శుక్రవారం ప్రకటించారు. దీంతో మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ ఆశాలత, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ ఐసీయూ వార్డులోకి వెళ్లి బాధితుడిని అడిగి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు. ఇది అంటువ్యాధి కాదని, ఇతరులకు సోకదని ఆస్పత్రి వైద్యులు చెబుతున్నారు.

బాధితుడు పెడన వాసి

పెడనకు చెందిన యువకుడు (33) కైకలూరు మండలం తామరకొల్లులో బతుకుదెరువు నిమిత్తం ఉంటున్నాడు. అక్కడ తీవ్ర అనారోగ్యం బారిన పడటంతో రెండు రోజుల కిందట పెడనలోని తన ఇంటికి వచ్చాడు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో మిగతా 6లో..



భారీ గోతులు, బయటపడిన రాళ్లతో ప్రమాదకరంగా ఉన్న కాజ్‌వే

తెలుగురాష్ట్రాల మధ్య రాకపోకలకు ప్రధాన మార్గాల్లో ఒకటి.. చిల్లకల్లు-వైరా రోడ్డులో మున్నేరు ఉపనదిపై అర్ధ శతాబ్దం క్రితం నిర్మించిన 'కాజ్‌వే'.. ఆంధ్రా-తెలంగాణ రాష్ట్రాలను అనుసంధానం చేసే ఈ కాజ్‌వే ప్రస్తుతం శిథిలావస్థకు చేరి వాహనదారులకు ప్రాణసంకటంగా మారింది. ప్రస్తుతం కాజ్ వే పటిష్టతపై అనుమానాలు నెలకొన్నాయి. రెండు రాష్ట్రాల మధ్య రాకపోకలు సాగుతున్నా.. ఎప్పుడు కూలిపోతుందో అన్నట్టుగా ఈ కాజ్‌వే పరిస్థితి తయారైంది. భారీ గోతులు, పగుళ్లు వాహనదారులను భయపెడుతున్నాయి. దెబ్బతిన్న రెయిలింగ్, స్లాబ్, కాంక్రీట్ అప్రోచ్ బండ్ నుంచి బండరాళ్లు ఊడి పెను ప్రమాదానికి సంకేతంలా నిలుస్తున్నాయి. మున్నేరుపై కాజ్‌వే పునర్నిర్మాణానికి ప్రభుత్వం పూనుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



రోడ్డుపై గోతులు

ప్రమాదకరంగా.. కాజ్ వే!

- ధ్వంసమైన రోడ్డుపై వాహనదారుల ఫీట్లు
- ఏపీ, తెలంగాణా మధ్య రెండో ప్రధాన మార్గం..
- చిల్లకల్లు-వైరా రోడ్డులో మున్నేరుపై కాజ్ వేకు 50 ఏళ్లు
- ఏటా కాజ్‌వే మీదుగా వరద ప్రవాహం
- దెబ్బతిన్న రెయిలింగ్, స్లాబ్ పగుళ్లు.. భారీ గోతులు
- కాంక్రీట్ అప్రోచ్ బండ్ నుంచి బయటకు వస్తున్న రాళ్లు
- కాజ్‌వే పటిష్టపరచాలని వాహనదారుల డిమాండ్

(వత్సవాయి, ఆంధ్రజ్యోతి) చిల్లకల్లు-వైరా రహదారిలో లింగాల వద్ద మున్నేరు ఉపనదిపై ఉన్న కాజ్‌వేపై వెళ్లాలంటే వాహనదారులు హడలిపోతున్నారు. ప్రతీ ఏడాది వచ్చే వరదల తాకిడికి కాజ్‌వే కొట్టుకుపోతోంది. దీంతో దెబ్బతిన్న కాజ్‌వేపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా మారింది. అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేస్తున్నా.. పటిష్ఠంగా నూతన కాజ్‌వే నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శిథిలావస్థలో యాభైఏళ్ల వంతెన



మున్నేరుపై లింగాల వద్ద 1975లో మొత్తం 50 ఖానాలతో 12 అడుగుల ఎత్తున నిర్మించిన కాజ్‌వేకు దాదాపుగా యాభై ఏళ్లు పూర్తవుతోంది. వర్షాకాలంలో ఎగువన కురిసిన వర్షాలకు మునేరు పరవళ్లు తొక్కడంతో కాజ్‌వేపైకి నాలుగైదు అడుగుల వరదనీరు ప్రవహిస్తుంటుంది. ప్రవాహం తగ్గే వరకు నాలుగైదు రోజుల పాటు ఆంధ్రా, తెలంగాణాల మధ్య వాహన రాకపోకలు నిలిచిపోతున్నాయి. వరద తాకిడికి కాజ్‌వేకు ఇరువైపులా ఉన్న రెయిలింగ్ పోల్స్ మొత్తం విరిగిపోయి పూర్తిగా భారీ గుంతలమయంగా మారింది. ఈ రహదారిపైనే ఖమ్మం, భద్రాచలం, ఏలూరు, రాజమండ్రి తదితర ప్రాంతాలకు నిత్యం సిమెంట్ లారీలు తిరుగుతుంటాయి. పెనుగంచిప్రోలులో కొలువైన తిరుపతమ్మ దేవాలయంలో నిత్యం పూజలందుకునే అమ్మవారిని దర్శించుకునేందుకు తెలంగాణ గ్రామాలకు చెందిన భక్తులు ఈ రహదారి మీదుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాజ్‌వేను పునర్నిర్మించాలని పలువురు కోరుతున్నారు.

కాజ్‌వే పై ప్రయాణం నరకం

- కట్టా శ్రీనివాసరావు, మక్కపేట రైతు



మూడు అడుగుల లోతు గుంతల్లో ప్రయాణం నరకప్రాయంగా ఉంది. కాజ్‌వేకు తాత్కాలిక మరమ్మతులు కాకుండా పటిష్ఠంగా ఏర్పాటు చేయాలి. వ్యవసాయ ఉత్పత్తులు రవాణా చేసుకోవాలన్నా తిప్పలు పడుతున్నాం.

రాత్రి వేళల్లో కాజ్‌వేపై వెళ్లే పరిస్థితి లేదు

- భూక్యా సోమ్లానాయక్, లారీడ్రైవర్



రాత్రి వేళల్లో కాజ్‌వే పై ప్రయాణం నరకం.. విద్యుత్ దీపాలు లేక రాత్రుళ్లు ప్రమాదకరంగా ఉంటోంది. కాజ్‌వేకు ఇరువైపులా రెయిలింగ్ కనిపించక గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగాయి. రాత్రి సమయంలో కాజ్‌వే పక్కన వాహనాలను నిలిపి ఉదయం ప్రయాణం చేయాల్సి వస్తోంది.

మరమ్మతులు చేపడుతున్నాం

- పరుశురాముడు, ఆర్అండ్‌బీ డీఈ

కాజ్‌వే పునర్నిర్మాణం దిశగా అడుగులు పడుతున్నాయి. ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాం.. ప్రస్తుతం కాజ్‌వే మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.50 కోట్లు మంజూరు చేసింది. త్వరలోనే పనులు చేపడతాం.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ కేశినేని శివనాథ్

స్పీకర్ ఓం బిర్లాను కలిసిన ఎంపీ కేశినేని చిన్ని

వన్‌టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) శుక్రవారం లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను ఢిల్లీలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనకు పుష్పగుచ్ఛం, వెంకటేశ్వరస్వామి ప్రతిమను ఇచ్చి సత్కరించారు.

రేపు జిల్లా ట్రెజరీ ఉద్యోగ సంఘ ఎన్నికలు

గవర్నర్‌పేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ట్రెజరీ అండ్ అకౌంట్స్ సర్వీసెస్ అసోసియేషన్ ఎన్టీఆర్ జిల్లా నూతన కార్యవర్గ ఎన్నికలు ఈనెల 23న జిల్లా ట్రెజరీ కార్యాలయంలో నిర్వహించనున్నట్టు అసోసియేషన్ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి బి.శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఎన్నికల్లో ఎన్నికల అధికారిగా ఎస్‌కె హసీనా బేగం, అసిస్టెంట్ ఎలక్షన్ ఆఫీసర్‌గా ఎస్‌కె పయాజ్ అహమ్మద్, పరిశీలకురాలిగా ఐ.అరుణ వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

రంగ.. రంగా!

(5వ పేజీ తరువాయి)

నుంచి స్పందన లేదు. లోతుగా ఆరా తీస్తే రంగా అనుయాయుడు పేరుతో ఉన్న రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌లో దినేష్ సాక్షిగా ఉన్నాడన్న విషయం తెలిసి నివ్వెరపోయారు. తాము మోసపోయామని గ్రహించారు. రంగా ప్రోద్బలంతోనే శివాజికి మరో డాక్యుమెంట్ పుట్టిందని నిర్ధారించుకున్న ప్లాట్ల యజమానులంతా ఒక అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. వీరిలో కొంతమంది కోర్టును ఆశ్రయించారు. విచారణ జరుగుతోంది. రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు కూడా చేశారు. అధికారుల దృష్టికి ఈ విషయాన్ని ప్లాట్ల యజమానులు తీసుకెళితే కోర్టులో తేల్చుకోవాల్సిందే, తామేమీ చేయలేమని స్పష్టం చేయడంతో బాధితులంతా కన్నీరుమున్నీరవుతున్నారు.

ఒకే పొలాన్ని ఇద్దరికి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు

- సోమరౌతు సూరిబాబు, బాధితుడు

మల్లవల్లిలోని వెంచర్లో స్థలాన్ని 2014లో కొనుగోలు చేశా. నాకు స్థలం అమ్మింది వసంతాడ రత్తయ్య కుమారుడు సాంబశివరావు. ఆయన సాయితేజ ఇన్‌ఫ్రా హైలెట్ ప్రైవేట్ లిమిటెడ్‌కు ఛైర్మన్‌గా ఉన్నారు. స్థలం రిజిస్ట్రేషన్ చేసిన కొద్ది కాలానికే ఆయన మరణించారు. తర్వాత కంపెనీకి డైరెక్టర్ హోదాలో ఆయన కుమారుడు దినేష్ వ్యవహారాలన్నీ చూసుకునేవాడు. డబుల్ రిజిస్ట్రేషన్ వ్యవహారమై దినేష్‌ను నిలదీస్తే సమాధానం లేదు. ఒకే పొలాన్ని ఇద్దరికి ఎలా రిజిస్ట్రేషన్ చేస్తారు. వల్లభనేని వంశీ అనుచరుడు రంగా ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్లుగా తెలుసుకుని మిన్నకుండిపోయాం.

సూర్యఘర్ లక్ష్యాలపై దృష్టిపెట్టండి

- అమలు పురోగతిపై నిరంతర సమీక్ష : కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పీఎం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం కింద రిజిస్ట్రేషన్‌లతో పాటు సౌర ఫలకాల ఏర్పాటు (ఇన్‌స్టలేషన్)పై ప్రతి మండలానికి నిర్దేశించిన లక్ష్యాలపై అధికారులు దృష్టిసారించాలని, పథకం అమలు పురోగతిపై ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించనున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. శుక్రవారం కలెక్టరేట్‌లో పీఎం సూర్యఘర్ పథకం అమలుపై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇప్పటివరకు జరిగిన రిజిస్ట్రేషన్‌లతో పాటు ఇన్‌స్టలేషన్స్‌పై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ఏడు లక్షల విద్యుత్ సర్వీసుల్లో కనీసం రెండు లక్షల ఇళ్లకు సూర్యఘర్ కనెక్షన్లు లక్ష్యంగా నిర్దేశించుకొన్న నేపథ్యంలో విద్యుత్, గ్రామీణాభివృద్ధి విభాగాల అధికారులు, బ్యాంకర్లు, వెండర్లు, ఇలా వివిధ భాగస్వామ్య పక్షాలు సమిష్టిగా కృషిచేయాల్సిన అవసరముందన్నారు. ఇప్పటికే 75 వేల రిజిస్ట్రేషన్లు వచ్చినందున త్వరితగతిన సౌర ఫలకాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, బ్యాంకులు రుణ మంజూరును వేగవంతం చేయాలని పేర్కొన్నారు. జిల్లాలో ఆదర్శ గ్రామాలుగా గుర్తించిన బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం (మైలవరం), పరిటాల (కంచికచర్ల), కంభంపాడు (ఎ.కొండూరు) షేర్ మహ్మద్ పేట (జగ్గయ్యపేట), గ్రామాల్లో సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు లక్ష్యాలపై ప్రత్యేకంగా దృష్టిసారించాలని, త్వరితగతిన 100 శాతం లక్ష్యాన్ని చేరుకోవాలని ఆయా మండలాల ఎంపీడీవోలు, ఏఈలను కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీమోహన్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, సూర్యఘర్ నోడల్ అధికారి ఎం.భాస్కర్, ఏపీసీపీడీసీఎల్ ఈఈ, డీఈ, ఏఈలతో పాటు వివిధ బ్యాంకుల ప్రతినిధులు, వెండర్లు హాజరయ్యారు.



అమ్మవారి దర్శనానికి భక్తుల రద్దీ, మహిళల పొణాసారాలు(కింద)

వీరమ్మ తిరునాళ్లకు తరలివస్తున్న భక్తులు



ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లకు భక్తులు తరలివస్తున్నారు. తిరునాళ్లలో 14వ రోజైన శుక్రవారం అమ్మవారిని దర్శించి మొక్కుబడి తీర్చుకునేందుకు భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. శనివారంతో తిరునాళ్ల ముగియనున్న నేపథ్యంలో అమ్మవారికి మొక్కులుతీర్చుకు నేందుకు పలు ప్రాంతాలనుంచి తరలివస్తున్నారు. పట్టణ సీఐ రామారావు, ఎస్‌ఐ విశ్వనాథ్, సిబ్బందితో కలిసి వచ్చి దీపారాధనలతో పొటేళ్లతో ఆలయ ప్రదక్షిణచేసి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు అమ్మవారి ఆలయం వెనుక తడివస్త్రాలతో పొణాసారాలు చేశారు.



హార్డ్‌డిస్క్ పెట్టిన ప్రదేశాన్ని తాతయ్యకు చూపుతున్న బాధితుడు

పకడ్బందిగా భద్రతా ఏర్పాట్లు చేసినా..

చోరీని నివారించలేకపోయాం!

- ఎమ్మెల్యే ఎదుట డాక్యుమెంట్ రైటర్ ఆవేదన

జగ్గయ్యపేట, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణ శివార్లలో ఇల్లు నిర్మించుకుని పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసినా చోరీని నివారించలేకపోయామని డాక్యుమెంట్ రైటర్ ప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఎదుట ఆవేదన వ్యక్తం చేశాడు. శుక్రవారం విష్ణుప్రియనగర్‌లో చోరీ జరిగిన ఇంటిని ఎమ్మెల్యే పరిశీలించి బాధితుడిని పరామర్శించారు. కట్టుదిట్టంగా ఇంటికి అన్నివైపులా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు చేసుకున్నా, సీసీ కెమెరాలతో నిఘా పెట్టినా.. దొంగలు 11 అడుగుల ఎత్తులో ఉన్న హార్డ్‌డిస్క్‌ను ఎత్తుకెళ్లారని, సీసీ కెమెరా వైర్లను తొలగించారని చెప్పారు. 200 గ్రాముల బంగారం, 200 యూఎస్ డాలర్లు, రూ.20వేల నగదు చోరీకి గురైనట్టు తాతయ్యకు వివరించారు. అక్కడి నుంచే సీపీతో తాతయ్య ఫోన్‌లో మాట్లాడి అన్ని కోణాల్లో, ఆధునిక టెక్నాలజీ ఉపయోగించి నిందితులను పట్టుకోవాలని కోరారు. ఆయన వెంట ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

హోటళ్లకు గ్రీన్ లీఫ్ రేటింగ్

- స్వచ్ఛతా ప్రమాణాల ఆధారంగా వన్ లీఫ్, త్రీ లీఫ్, ఫైవ్ లీఫ్ స్టేటస్‌కు కార్యాచరణ
- డివిజన్, జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీలు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పర్యావరణ హిత స్వచ్ఛత, పారిశుద్ధ్యంలో అత్యుత్తమ ప్రమాణాలు పాటిస్తూ పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చే హోటళ్లు, లాడ్జిలకు ప్రభుత్వం 'గ్రీన్ లీఫ్' రేటింగ్ ఇవ్వనున్నట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ అధ్యక్షతన కలెక్టరేట్‌లో స్వచ్ఛతా గ్రీన్ లీఫ్ రేటింగ్ సిస్టమ్ (ఎస్‌జీఎల్ఆర్ఎస్)పై వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో ఆతిథ్య రంగం కీలకమైనదని, పర్యాటక రంగంలో భాగంగా ఆతిథ్య రంగంలో సురక్షిత పారిశుధ్య నిర్వహణను ప్రోత్సహించేందుకు 'గ్రీన్ లీఫ్' రేటింగ్ వ్యవస్థను ఆవిష్కరించినట్టు వివరించారు. హోటళ్లు, లాడ్జిలు, హోమ్‌స్టేలు, ధర్మస్థలాలు తదితర ఆతిథ్య సౌకర్యాలకు గ్రీన్ లీఫ్ రేటింగ్ ఇవ్వడం జరుగుతుందన్నారు. వన్ లీఫ్ రేటింగ్ పొందాలంటే ఘనవ్యర్థాలు, మానవ వ్యర్థాలు, మురుగునీటి నిర్వహణలో 100-130 మార్కులు రావాలని, అదేవిధంగా త్రీ లీఫ్ రేటింగ్‌కు 130-180 మార్కులు, ఫైవ్ లీఫ్ రేటింగ్‌కు 180-200 మార్కులు సాధించాల్సి వుంటుందని వివరించారు. రేటింగ్‌కు సిఫార్సు చేసేందుకు వీలుగా జిల్లాస్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన గ్రామీణ నీటి సరఫరా విభాగం సూపరింటెండింగ్ ఇంజినీర్ కన్వీనర్‌గా, జిల్లా పర్యాటక అధికారి సభ్య కార్యదర్శిగా కమిటీ వుంటుందని, అదేవిధంగా డివిజన్ స్థాయిలో ఆర్డీవో చైర్మన్‌గా వెరిఫికేషన్ ఉప కమిటీ వుంటుందని తెలిపారు. ముందుగా హోటళ్లు, లాడ్జిలు తదితరాలను స్వచ్ఛ భారత్ అభియాన్ (గ్రామీణ్) వెబ్‌సైట్ ద్వారా మ్యాపింగ్ చేయాల్సి వుందని, ఆయా యాజమాన్యాలకు డివిజన్ స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, రేటింగ్ వ్యవస్థ గురించి వివరించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాస్థాయిలోనూ వర్క్‌షాపులతో పాటు శిక్షణ కార్యక్రమాలపైనా దృష్టిసారించాలని స్పష్టం చేశారు. ఈ ఏడాది అక్టోబరు 2 నాటికి రాష్ట్ర వ్యాప్తంగా కనీసం వెయ్యి ఆతిథ్య లొకేషన్లకు ర్యాంకింగ్స్ ఇవ్వాల్సి వుందని, ఈ నేపథ్యంలో జిల్లాస్థాయిలో ర్యాంకింగ్‌కు సంబంధించిన కార్యకాలాపాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ రేటింగ్స్ వల్ల పర్యాటకులతో పాటు ఆయా హోటళ్ల యాజమాన్యాలకు ప్రయోజనం వుంటుందని, అమరావతికి గేట్‌వే వంటి విజయవాడలో ఎక్కువ హోటళ్లు, లాడ్జిలు మంచి గ్రీన్ లీఫ్ రేటింగ్ సాధించి, పర్యాటకపరంగా, ఆతిథ్యం పరంగా జిల్లాను ముందు నిలిపేందుకు భాగస్వామ్య పక్షాలు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో గ్రామీణ నీటి సరఫరా ఎస్ఈ ఎస్.విద్యాసాగర్, జడ్పీ సీఈవో కె.కన్నమనాయుడు, ఏపీ హోటల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఆర్వీ స్వామి, ఏపీటీడీసీ డివిజనల్ మేనేజర్ చైతన్య, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, గ్రామ వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీపీవో పి.లావణ్యకుమారి, జిల్లా టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ ప్రతినిధి టి.రవికుమార్, డీఎల్‌డీవోలు తదితరులు హాజరయ్యారు. విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య, తిరువూరు ఆర్డీవో కె.మాధురి, నందిగామ ఆర్డీవో కె.బాలకృష్ణయ్య వర్చువల్‌గా సమావేశానికి హాజరయ్యారు.

రెవెన్యూ అర్జీలపై అధికారుల ఆరా

- ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో పలువురికి ఫోన్లు
- సమస్యల పరిష్కారంపై అర్జీదారులకు ఆర్డీవోలు, తహసీల్దార్ల ప్రశ్నలు
- మెరుగైన పాలనకు దోహదం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : పట్టాదారు పాస్‌బుక్‌కు ఎంత డబ్బులు తీసుకున్నారు? రీ సర్వే జరుపుతున్నపుడు మీకు నోటీసు ఇచ్చారా? గతంలో ఏమైనా బెదిరింపులు వచ్చాయా? వీఆర్‌వోలు మీ దగ్గర డబ్బులు డిమాండ్ చేశారా? క్షేత్ర స్థాయిలో రెవెన్యూ సిబ్బంది వచ్చి మీ సమస్యను విన్నారా? పరిశీలించారా? ఇలా.. రెవెన్యూ అధికారులు ఉమ్మడి కృష్ణాజిల్లాలో రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు సమర్పించిన వారికి ఫోన్లు చేస్తున్నారు. రెవెన్యూ ఫిర్యాదులకు సంబంధించి అర్జీలు సమర్పించినవారితో జిల్లా ఉన్నతాధికారుల నుంచి అధికారుల వరకు ఫోన్లు చేసి స్వయంగా తెలుసుకోవాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయటంతో ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలలో ఆర్డీవోలు, తహసీల్దార్లు అర్జీదారులకు గత రెండు రోజులుగా ఫోన్లు చేస్తున్నారు. రెవెన్యూ సదస్సులలో ప్రధానంగా రీ సర్వే సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాల సమస్యలపై ఎక్కువగా అర్జీలు రావటంతో వాటికి సంబంధించి ర్యాండమ్‌గా తమ దగ్గరకు వచ్చిన అర్జీలను తీసుకుని నేరుగా అర్జీదారులకు ఫోన్లు చేస్తున్నారు. రీసర్వే అంశాలకు సంబంధించిన అర్జీలు అయితే.. రీ సర్వేకు సంబంధించి గతంలో ముందస్తు నోటీసులు ఇచ్చారా? క్షేత్ర స్థాయిలో వచ్చి సర్వే జరిపారా? మీ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకున్నారా? వంటి ప్రశ్నలను అడిగి వారి దగ్గర నుంచి సమాచారం పొందే ప్రయత్నం చేస్తున్నారు. పాస్‌బుక్‌లకు సంబంధించి ప్రభుత్వం నిర్దేశించిన ధర కంటే ఎక్కువ చెల్లించారా? ఎంత చెల్లించారు? ఎవరికి చెల్లించారు? పాస్‌బుక్‌ల జారీలో ఉద్దేశ్యపూర్వక జాప్యం చేశారా? వీఆర్వో, ఆర్ఐలు ఇబ్బంది పెట్టారా? డబ్బులు డిమాండ్ చేశారా? వంటి విషయాలపై ప్రశ్నలు సంధించారు. శుక్రవారం తహసీల్దార్లు పెద్ద సంఖ్యలో అర్జీదారులకు ఫోన్లు చేశారు. ఫోన్లు చేసే క్రమంలో తహసీల్దార్లకు సమస్యలు ఎదురయ్యాయి. తాము ఫోన్లు చేసిన వారిలో సగానికి పైగా అందుబాటులో లేరని తెలుస్తోంది. కొంతమంది వేరే వ్యక్తుల ఫోన్ నెంబర్లు ఇవ్వటంతో ఈ సమస్య ఏర్పడింది. అందుబాటులోకి వచ్చిన వారి నుంచి తహసీల్దార్లు వివరాలు నమోదు చేసుకున్నారు. వివరాల ప్రాతిపదికన ఆయా అర్జీదారుల సమస్యలను మరోమారు విశ్లేషిస్తారు. కేసు స్టడీ మాదిరిగా తీసుకోవటం వల్ల క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలను ఆకళింపు చేసుకోవటంతో పాటు మరింత మెరుగ్గా ఆ సమస్యలను పరిష్కరించటానికి దోహదపడుతుంది. అలాగే రెవెన్యూ వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు కూడా ఇదే సందర్భంలో అవకాశం కలుగుతుంది.

వేగంగా..

(5వ పేజీ తరువాయి)

తరఫున కూడా తరచూ సమీక్షించాలని నిర్ణయం తీసుకుంది. కూచిపూడి, అమరావతి డిజైన్స్, ఏపీ కల్చర్‌ను ప్రతిబింబించేలా ఇంటిగ్రేటెడ్ టెర్మినల్ బిల్డింగ్‌ను తీర్చిదిద్దేందుకు నిర్దేశించిన ఆర్కిటెక్ట్ డిజైన్స్, ఇంటీరియర్‌ను వేరే సంస్థకు ఇచ్చి చేయించాలన్న ఆలోచన కూడా చేస్తోంది.

అతి పెద్ద పార్కింగ్ ఏరియా

విజయవాడ విమానాశ్రయంలో రన్‌వేకు అనుసంధానంగా అతి పెద్ద పార్కింగ్ బే ఏర్పాటు చేశారు. రాష్ట్రంలోని అన్ని ఎయిర్ పోర్టుల కంటే ఇదే పెద్దది కావటం గమనార్హం. ఎయిర్‌క్రాఫ్ట్ పార్క్ ఏరియా (ఆప్రాన్)లో మొత్తం 24 స్టాండ్స్ ఉన్నాయి. ఒక్కసారిగా 24 విమానాలను పార్క్ చేయవచ్చు. ప్రస్తుతం ఆప్రాన్ రీ ఓరియంటేషన్ వర్క్స్ జరుగుతున్నాయి. నైట్ పార్కింగ్‌కు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నారు.

ఉలికి పాటు..

(5వ పేజీ తరువాయి)

ఈ నెల 20న మచిలీపట్నం సర్వజన ఆస్పత్రిలో చేరాడు. జ్వరం లేకుండానే తీవ్రమైన ఒళ్లు నొప్పులు, నరాలకు సంబంధించిన అనారోగ్యంతో బాధ పడుతున్నాడు. వైద్యులు బాధితుడికి రక్త పరీక్షతో పాటు వివిధ రకాల వైద్య పరీక్షలు చేశారు. ఈ పరీక్షల్లో అతనికి గులియన్ బారే సిండ్రోమ్(జీబీఎస్) లక్షణాలు ఉన్నట్లు గుర్తించారు. ఆస్పత్రి సూపరింటెండెంటెంట్ ఆశాలత ఆదేశాల మేరకు బాధితుడిని ఐసీయూలో ఉంచి న్యూరో విభాగం వైద్యుడు కిరణ్ పర్యవేక్షణలో ప్రత్యేక చికిత్సను అందిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు వైద్యులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రస్తుతం అతని ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యుడు కిరణ్ తెలిపారు. కాగా, జీబీఎస్ కేసు నమోదు కావడంతో కలెక్టర్ ఆదేశాల మేరకు డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ఠ జిల్లాలోని ఆయా పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న వైద్యులను అప్రమత్తం చేశారు. ఈ లక్షణాలతో ఇబ్బందులు పడుతున్న వారిని గుర్తించాలని, మెరుగైన చికిత్స అందేలా చూడాలని ఆదేశించారు. వారి వివరాలు జిల్లా కేంద్రానికి తెలియజేయాలని సూచించారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాష దినోత్సవాన్ని పురస్కరించుకొని ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో వేడుకలు శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ శిష్య బృందం మా తెలుగు తల్లికి మల్లెపు దండ, తేనెల తేటల మాటలతో, చెక్కర కలిపిన తియ్యని పాటలకు నృత్యాలు చేసి అలరించారు. సంగీత కళాశాల ప్రిన్సిపాల్ నరసమ్మ శిష్య బృందం చక్కెర కలిపిన తీయని కమ్మని, తేనె వంటి భాష ఒక్క తెలుగే, ఏ దేశం కొన్నది ఈ గొప్పచరిత్ర, జయతి జయతి భారత మాత వంటి పాటలను మధురంగా గానం చేసింది. ప్రభుత్వ భాషా సంస్థ డైరెక్టర్ ఆర్.మల్లికార్జునరావు, ప్రసంగ ప్రజ్ఞానిధి డాక్టర్ గుమ్మా సాంబశివరావు తెలుగు భాష వైభవం గురించి ప్రసంగించారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జీవీ పూర్ణచందు, స్టెల్లా కళాశాల సంస్కృత విభాగాధిపతి డాక్టర్ ధూళిపాళ్ల రామకృష్ణ, ప్రాంత అధ్యాపకుడు డాక్టర్ యశోద పూర్ణచంద్, అధ్యాపకులు ఒలివేటి శివ రామకృష్ణ, కె.రామకృష్ణ పాల్గొన్నారు.

పవిత్ర సంగమంలో చురుగ్గా శివరాత్రి ఏర్పాట్లు

ఇబ్రహీంపట్నం,ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : కృష్ణా - గోదావరి నదులు కలిసే పవిత్ర ప్రదేశం ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమ ప్రాం తంలో ఈనెల 26న భక్తులు శివరాత్రి పుణ్యస్నా నాలు ఆచరించేందుకు అధికారులు చురుగ్గా ఏ ర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఘాట్ల వద్ద ఇటీవల వరదలకు పేరుకుపోయిన బురదను డోజర్ల సాయంతో బయటకు తరలించారు. ఘాట్ల వద్ద ఉన్న లైట్లను బాగు చేయిస్తున్నారు. గతేడాది ఇక్కడ సుమారు 1.20 లక్షల మంది భక్తులు పుణ్య స్నానాలు ఆచరించారు. అందుకు తగిన విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని కొండపల్లి మున్సిపల్ కమిషనర్ రమ్య కీర్తన తెలిపారు.

ఉత్సాహంగా ఆట, పాట, మాట

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని గాంధీనగరంలోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం రంగం ప్రజా సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'చెయ్యెత్తి జై కొట్టు తెలుగోడా' జానపదం పేరిట ఆట-పాట-మాట కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన గాయనీ గాయకులు తెలుగుభాషపై పాటలు మధురంగా ఆలపించి ఉర్రూతలూగించారు. కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు తెలుగుభాష ఉద్ధరణకు తల్లిదండ్రులు తమ వంతు బాధ్యత వహించాలన్నారు. జన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు కొలనుకొండ శివాజీ పలువురు కవులు, కళాకారులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని రంగం రాష్ట్ర కార్యదర్శి ఆర్.రాజేష్ నిర్వహించారు. ముందుగా గొట్టుముక్కల రఘురామరాజుకు ఆత్మీయ సత్కారం నిర్వహించారు. అనంతరం అతిథులతోపాటు కళాకారులను నిర్వాహకులు సత్కరించారు.



గొట్టుముక్కల రఘురామరాజును సత్కరిస్తున్న మండలి బుద్ధప్రసాద్, కొలనుకొండ శివాజీ తదితరులు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

రీసర్వే పనుల తనిఖీ

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : జబర్లపూడిలో జరుగుతున్న భూమి రీసర్వే పనులను ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే ఎస్ నాగేశ్వరరావు శుక్రవారం తనిఖీ చేశారు. మండలంలో జబర్లపూడి పైలెట్ ప్రాజెక్ట్ గ్రామంగా ఎంపిక చేసి రీ సర్వే పనులు చేస్తున్న నేపథ్యంలో ఆయన తనిఖీ చేశారు. ఇప్పటి వరకు జరిగిన పనులను మండల రీసర్వే డీటీ వెంకటేశ్వరరావు వివరించారు. మండల సర్వేయర్ దగాని సురేశ్‌బాబు, వీఆర్వో లోకేశ్వరరావు, గ్రామ కార్యదర్శి రవితేజ పాల్గొన్నారు.



స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువెళ్తున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

వైభవంగా ఆలయ వార్షికోత్సవం

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బుద్ధవరం అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. అర్చకులు గుదిమెళ్ల దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, నవరసాభిషేకం, సింధూరాభిషేకం, పుష్పాభిషేకాలు వేడుకగా జరిగాయి. సాయంత్రం లక్ష తమల పాకులతో సహస్రనామ గంధ సింధూర పూజ నిర్వహించి హనుమాన్ చాలీ సా పారాయణం చేశారు. ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. ఏలూరు కాలువ డిస్ట్రిబ్యూటరీ వైస్ చైర్మన్ కొసరాజు రాంబాబు, టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు, పాలకేంద్రం అధ్యక్షుడు గొంది నరేంద్ర, గూడవల్లి నాగేశ్వరరావు, గొంది శివకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కానుమోలు సోమేశ్వరస్వామి ఆలయంలో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : కానుమోలు గంగా బాలత్రిపుర సుందరీ దేవి సమేత సోమేశ్వరస్వామి దేవస్థాన పునఃనిర్మాణం పూర్తయిన సందర్భంగా నూతన నవగ్రహ దేవతల ప్రతిష్ఠామహోత్సవ పూజలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య నిర్వహించిన యాగంలో దాతలు నండూరి శ్రీరంగసాయి, లలితమ్మ, తాడిశెట్టి శ్రీహరి, నాగరూప దంపతులు పాల్గొన్నారు. ఆదివారం నూతన నవగ్రహ దేవతా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వీఆర్ సిద్ధార్థ కళాశాలను సందర్శించిన

డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం

పెనమలూరు, ఫిబ్రవరి21 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర హోంమంత్రిత్వ శాఖలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ప్రొఫెసర్ల బృందం 5 రోజుల రెసిడెన్షియల్ ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా శుక్రవారం స్థానిక వీఆర్ సిద్ధార్థ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్‌ను సందర్శించింది. ఇటీవల విజయవాడలో వచ్చిన వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొన్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతో మాట్లాడి వారి అనుభవాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ, విపత్తులను తట్టుకొనే సమాజాన్ని నిర్మించేందుకు చేస్తున్న కృషిలో డిజాస్టర్ సంస్థ భాగస్వామి కావడం గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో కల్నల్ పీఎస్ రెడ్డి, డాక్టర్ రాకా, డాక్టర్ బాలు, బీ శ్రీనివాస్, వలంటీర్లు పాల్గొన్నారు.

సెస్ బకాయిలు ఇప్పించాలి..

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గ్రంథాలయ సంస్థకు రావాల్సిన సెస్ బకాయిలను ఇప్పించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ డీకే బాలాజీకి ఆ సంస్థ ఉద్యోగుల సంఘం 31/17 నాయకులు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌ల ద్వారా ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన గ్రంథాలయ సెస్ బకాయిలపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగుల సంఘం ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు కె.కృపానందం, ప్రధాన కార్యదర్శి ఎస్.చినరాజు, మహిళా అధ్యక్షురాలు కోగంటి పద్మావతి, కేవీ సుబ్రమణ్యేశ్వరరావు, సాలార్ షరీఫ్, ఎస్‌కె రహీం, తోకల రాంబాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టర్ డీకే బాలాజీని దుశ్శాలువాలతో సత్కరించారు.

భారీ అన్నసమారాధన



ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మ తిరునాళ్లలో భక్తులకు శుక్రవారం భారీ అన్నసమారాధన చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు పెద్దయెత్తున అన్నసమారాధన చేయగా కమిటీ సభ్యులు ప్రసాద్, నెరుసు వీరకుమార్, బాలకృష్ణ, శ్రీనివాస్ ఇతర సభ్యులు పాల్గొని సేవలందించారు. పొడవాటి క్యూల్లో నిలుచుని అమ్మ వారి ప్రసాదం అందుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పెనమలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా యనమలకుదురు సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ శివపార్వతినగర్ ఫీడర్ పరిధిలో లైన్ల మరమ్మతుల నేపథ్యంలో శనివారం 7.30 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గుణదల ఈఈ హరిబాబు తెలిపారు. పంచాయతీ ఆఫీసు ఏరియా, గౌడ బజార్, కొండ వెనుక శివపార్వతి నగర్ మండపం ఏరియా, సీతయ్యగారి వాటర్‌ప్లాంటు రోడ్డు ప్రాంతాల ప్రజలు సహకరించాలని కోరారు.

ప్రసాదంపాడు : ఎనికేపాడు సెక్షన్ 11కెవి విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా శనివారం ఉదయం 8.30 నుంచి 11.30 గంటల వరకు ప్రసాదంపాడులోని యాదవుల బజార్, వాటర్‌ట్యాంకు రోడ్డు, ఎస్సీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఎనికేపాడు ఏఈ పరమేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

వేగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ వేగవంతంగా జరుగుతుందని మండల వ్యవసాయశాఖ అధికారి వై.రజని తెలిపారు. గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలు, పంచాయితీ కార్యాల యాల వద్ద ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ 4,133 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన రైతులు కూడా త్వరగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

రహదారిపై ఆటోంకం

- జాతీయ రహదారిపై రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు రద్దీ
- ఆటోవాలాల తీరుతో ప్రమాదాలు
- ట్రాఫిక్ నియంత్రణపై పోలీసుల చర్యలు శూన్యం
- ఇబ్బందిపడుతున్న వాహనదారులు

(ప్రసాదంపాడు- ఆంధ్రజ్యోతి)

రామవరప్పాడు నుంచి నిడమానూరు వరకు జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. పేరుకే జాతీయ రహదారి.. విస్తీర్ణంలో చిన్నగా ఉంటూ ఇరుకుగా ఉంటుంది. ఈ మార్గంలో ప్రధానంగా సర్వీస్ ఆటోలతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా నెలకొంటుంది. సిటీ బస్సులు తక్కువగా ఉండడంతో రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్, ప్రభుత్వాసుపత్రి, బెంజ్‌సర్కిల్ వైపు వెళ్లేవారు ఎక్కువగా ఆటోలను ఆశ్రయిస్తుంటారు. సుమారుగా రోజుకు మూడు వేల ఆటోలు ఈ మార్గంలో ప్రయాణిస్తుంటాయి. రామ వరప్పాడు రింగ్, రామవరప్పాడు రైల్వేస్టేషన్ వంతెన, ప్రసాదంపాడు సెంటర్, ఎనికేపాడు ఎస్.ఆర్.కె కళాశాల ఎదుట, నిడమానూరు రామానగర్ సెంటర్ల వద్ద ఆటోలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ రద్దీ పెరుగుతోంది. దీనికి తోడు ఆటోలు నడిపేవారు ప్రయాణికులు కనిపిస్తే చాలు కనీసం సైడ్ సిగ్నల్ వేయకుండా రోడ్డు మధ్యలో నుంచి ఎడమచేతి వైపు ఉన్న పుట్‌పాత్ వైపు నడుపుతున్నారు. ఇలాంటి సమయంలో వాహనదారులు ఆటోలను తప్పించే క్రమంలో వెనుక నుంచి వస్తున్న పెద్ద వాహనాలను గమనించకుండా వెళ్లడంతో వాటి కిందపడి ప్రాణాలను కోల్పోతున్న ఘటనలు అనేకం. దీంతో వెనుక నుంచి వస్తున్న ద్విచక్రవాహనదారులు తరుచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు కేవలం ద్విచక్ర వాహనదారులపై ఫైన్‌లు వేయడానికి చూపే శ్రద్ధ ఆటోడ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించడం మీద చూపడం లేదనే ఆరోపణలున్నాయి. నిత్యం పెట్రోలింగ్ చేసి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డు మధ్యలో నిలిపిన ఆటో



జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు

- ఏలూరు రేంజ్ జీవీవీ అశోక్ కుమార్

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్ర జ్యోతి) : ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు తీసుకోవాలి ఏలూరు రేంజ్ జీవీవీ అశోక్ కుమార్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ సాధారణ తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు రావటం జరిగిందన్నారు. గన్నవరంలో విమానాశ్రయం ఉండటం వల్ల వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు. రాష్ట్రస్థాయి సభలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. గన్నవ రంలో ట్రాఫిక్‌కు ప్రాధాన్యత ఎక్కువైందన్నారు. ట్రాఫిక్ సిబ్బందికి తోడు లా అండ్ ఆర్డర్ సిబ్బందిని కూడా బందోబస్తుకి ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. విజయవాడ బైపాస్ అందుబాటులోకి వస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం జరుగుతుందన్నారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం డ్రోన్ కెమేరాలు ఉపయోగిస్తామన్నారు. సిబ్బందికి రిటైర్డ్ పోలీస్ అధికారుల ద్వారా ప్రత్యేక శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాజమండ్రిలో శిక్షణ ఇస్తున్నామని, త్వరలో కృష్ణాజిల్లా ట్రాఫిక్ సిబ్బందికి శిక్షణ ఇస్తామన్నారు. త్వరలో ఆరువేల మంది కానిస్టేబుల్స్ నియమకాలు జరుగుతాయని తెలిపారు. జిల్లాలో ఖాళీగా ఉన్న పోలీస్ శాఖకు సంబంధించిన స్థలాలను పరిశీలించి వాటిని ఎలా ఉపయోగించాలో నివేదిక తయారు చేస్తామన్నారు. ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు, డీఎస్పీ చలసాని శ్రీనివాసరావు, లా అండ్ ఆర్డర్ సీఐ బీవీ శివ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు రేంజ్ డీఐజీ అశోక్‌కుమార్‌కు మొక్క అందజేస్తున్న ట్రాఫిక్ సీఐ పెద్దిరాజు



కానూరులో రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం

కూటమి అభ్యర్థి ఆలపాటిని గెలిపించాలి

పెనమలూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి పార్టీల అభ్యర్థి ఆలపాటి రాజా తరపున ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం కానూరులో రాష్ట్ర తెలుగు మహిళ అధికార ప్రతినిధి యార్లగడ్డ సుచిత్ర ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆలపాటి రాజాకు మొదటి ప్రాధాన్యత ఓటును వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వల్లభనేని శరత్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

గన్నవరం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటిని గెలిపించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని టీడీపీ మండల అధ్యక్షుడు జాస్తి వెంకటేశ్వరరావు అన్నారు. మండలంలోని కొండపావులూరులో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తరపున శుక్రవారం రాత్రి రాత్రి ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు మల్లారెడ్డి కిషోర్, జూపల్లి సురేష్, మండవ లక్ష్మీ, కేహెచ్ కోటేశ్వరరావు, ఆరుమళ్ల కృష్ణారెడ్డి, దేవినేని సులోచన రాణి, చిక్కవరపు నాగమణి, ఎంపీటీసీ సభ్యుడు కొవ్వలి రాజు, ఉపసర్పంచ్ కూచిపూడి నరేష్ పాల్గొన్నారు.

ట్రెజరీ అసోసియేషన్ జిల్లా కోశాధికారిగా హరీష్



హరీష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీటీఎస్ఏ) ఉమ్మడి కృష్ణాజిల్లా కోశాధికారిగా తాళ్లూరి హరీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గన్నవరం ట్రెజరీ కార్యాలయంలో సీనియర్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న హరీష్ అసోసియేషన్ ఎన్నికల్లో కోశాధికారిగా ఏకగ్రీవం కావటంతో శుక్రవారం గన్నవరం తాలూకా ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షులు దామెర సీతారామయ్య పూలమాల వేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంజీవోస్ అసోసియేషన్ కోశాధికారి ఎం.రవి, ఎస్టీవో టి.నాగరాజు, టి.విజయ కుమార్, పి.వెంకట కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

వీరమ్మతల్లీ..చల్లగా దీవించు

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : వీరమ్మకు తిరునాళ్లలో మహిళలు పసుపుకుంకుమ, చీర, సారె సమర్పిస్తున్నారు. తిరునాళ్లలో 14వ రోజు శుక్రవారం కావడంతో మహిళలు పెద్దయెత్తున తరలివచ్చి పసుపు కుంకుమ, గాజులు, చీర సారె సమర్పించి చల్లగా దీవించు తల్లీ అని పూజలు చేశారు. పొంగళ్లు తయారు చేసి ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంతానం లేని వారు సంతాన సౌభాగ్యం కలగచేయి తల్లీ అని ప్రార్థిస్తూ పాణాసారం చేశారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగణంలో పసుపు కుంకుమ, గాజుల దుకాణాలు మహిళలతో కిక్కిరిసాయి.

భూ వివాదాల పరిష్కారానికి రీసర్వే

గన్నవరం, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): భూ వివాదాలను పరిష్కరించేందుకే ప్రభుత్వం రీసర్వే నిర్వహిస్తుందని జాయింట్ డైరెక్టర్, రాష్ట్ర సర్వే ల్యాండ్ రికార్డు అకాడమీ వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్‌వీఎస్ఎన్ కుమార్ అన్నారు. మండలంలోని కేసరపల్లి శివారు వీఎస్‌పురం కాలనీలో భూముల రీసర్వే కార్యక్రమాన్ని శుక్రవారం పరిశీలించారు. గుడివాడ ఆర్డీవో జి.బాలసుబ్రమణ్యం. తహసీల్దార్ కేవీ శివయ్య, డీఐఎస్ సీహెచ్ నరసింహారావు, సర్వేయర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

అమలాపురంలో పోరంకి యువకుడి అనుమానాస్పద మృతి

- రామాపురంలో విషాదం

పెనమలూరు, ఫిబ్రవరి21(ఆంధ్రజ్యోతి) : అమలాపురంలోని ఒక వైద్య కళాశాలలో ట్యూటర్‌గా పనిచేస్తున్న పోరంకి రామాపురం కాలనీకి చెందిన యలమంచిలి వెంకట జైనేంద్ర (28) అనుమానాస్పదస్థితిలో మృతి చెందడం రామాపురంలో విషాదం నింపింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పోరంకి రామాపురం కాలనీకి చెందిన వెంకట జైనేంద్ర అమలాపురంలోని ఒక వైద్య కళాశాలలో ట్యూటర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. వారం రోజులుగా కళాశాలకు వెళ్లడం లేదు. పట్టణంలోని ఒక లాడ్జిలో ఉంటూ తల్లిదండ్రులతో ఫోన్‌లో మాట్లాడేవాడు. మంగళవారం రాత్రి నుంచి ఫోన్ స్విచ్ ఆఫ్ అవడంతో తల్లిదండ్రులు ఖంగారు పడ్డారు. ఇంతలో అతడు లాడ్జిలోనే మృతి చెందిన విషయం తెలిసింది. దీంతో అమలాపురం చేరిన బంధువులు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని గురువారం రాత్రి పోరంకి తీసుకువచ్చారు. శుక్రవారం దహనసంస్కారాలు నిర్వహించారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు

ఉయ్యూరు, ఉయ్యూరు 21 (ఆంధ్రజ్యోతి) : ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల, నిరుద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గుంటూరు, కృష్ణాజిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు అన్నారు. ఉయ్యూరులో పలు విద్యాసంస్థల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం చేసేందుకు వచ్చిన ఆయన నాగళ్ల రాజేశ్వరమ్మ జానకీరామయ్య విజ్ఞాన కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీగా తన పదవీ కాలంలో వివిధ వర్గాల సమస్యలు శాసన మండలిలో ప్రస్తావించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేసానని తెలిపారు. శాసన మండలి సభ్యునిగా రాష్ట్రంలో ఏపార్టీ అధికారంలో ఉన్నా నిరుద్యోగ, ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల, అంగన్వాడీలు, రైతులు, ఆశా వర్కర్ల ఇతర పేద వర్గాల సమస్యల పరిష్కారానికి కృషి చేశానని గుర్తు చేశారు. పట్టభద్రుల నియోజక వర్గ పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీలో ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. యూటీఎఫ్ మాజీ రాష్ట్ర నాయకుడు కేపీ విశ్వమోహన్, రిటైర్డు ప్రిన్సిపాల్ ఎన్ లక్ష్మణరావు, ప్రజాసంఘాల నాయకులు వై నరసింహారావు, కోసూరి శివనాగేంద్రం, రాజేశ్, గోపాల్, ప్రేమ్, పలువురు పట్టభద్రులు పాల్గొన్నారు.

ఘనంగా మాతృభాషా దినోత్సవం



రచయిత దుర్గాప్రసాద్‌కు సత్కారం

ఉయ్యూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీ వేత్త, రచయిత, సరసభారతీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు గబ్బిట దుర్గాప్రసాద్‌ను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు నేరెళ్ల తేజ, కార్యదర్శి రాంబాబు, కోశాధికారి దినవహి ప్రసాద్, ప్రతినిధులు నల్లా శ్రీనివాస్, కృష్ణప్రసాద్, హాసన్‌అహ్మద్, రామనాథబాబు పాల్గొన్నారు.

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : రేమల్లె హైస్కూల్‌లో శుక్రవారం మాతృభాష దినోత్సవ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం భాస్కరరావు ఉపాధ్యాయులు వెంకటేశ్వరీ దేవి, వెంకటకుమారి, పార్థసారథి, పద్మ, రాజశేఖర్ పాల్గొన్నారు.

దీప్లానగర్‌లో కోళ్లు చనిపోయింది బర్డ్ ఫ్లూతోనే

● పశువైద్యాధికారి భరత్



ఫారంలో కోళ్లు తొలగించిన ప్రత్యేక సిబ్బంది

ఎ.కొండూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామ శివారు దీప్లానగర్‌లోని హనుమాన్ పౌల్ట్రీ ఫారంలో కోళ్లు చనిపోవడానికి బర్డ్ ఫ్లూనే కారణమని కంభంపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ భరత్ తెలిపారు. శుక్రవారం విజయవాడ నుంచి వచ్చిన ప్రత్యేక సిబ్బంది కోళ్ల ఫారంలోని మిగిలిన కోళ్లు, మేత, ఇతర వ్యర్థాలను తొలగించారు. ఫారానికి 500 మీటర్ల వరకు నిషేధిత ప్రాంతంగా ప్రకటించారు. ప్రజలు ఈ ప్రాంతానికి రావొద్దని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. మూడు రోజుల తర్వాత ఈ ప్రాంతమంతా స్ప్రేయింగ్ చేస్తామని తెలిపారు. మరో మూడు నెలల వరకు ఫారంలో కోళ్లు పెంచవద్దని యాజమానికి ఆదేశాలు జారీ చేశారు.

సంక్షేమ పథకాల అమలుపై న్యాయమూర్తుల వ్యాఖ్యలు దురదృష్టకరం

● తక్షణమే ఉపసంహరించుకోవాలి
● రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తల డిమాండ్



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

గాంధీనగర్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఉచితాలు అనుచితం, సబ్సిడీలు, సంక్షేమ పథకాలతో వ్యవసాయ కార్మికులు సోమరిపోతుల్లా మారుతున్నారని సుప్రీంకోర్టు న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, వాటిని తక్షణమే ఉపసంహరించుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. కార్పొరేట్లు, పెట్టుబడిదారులకు రుణమాఫీ చేసిన లక్షల కోట్లు వారి నుంచి రాబట్టేలా చర్యలు తీసుకోవాలని న్యాయమూర్తులను వారు కోరారు. దేశ ప్రజలకు అన్నం పెట్టే శ్రమజీవులను సోమరిపోతులు అనడం శోచనీయమన్నారు. ప్రభుత్వాలను గుప్పెట్లో పెట్టుకుని లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయించుకున్న కార్పొరేట్లు, పెట్టుబడిదారుల జోలికి వెళ్లకుండా పేదలకు ఇస్తున్న సంక్షేమ పథకాలను, ఉపాధిహామీ చట్టాన్ని రద్దు చేయాలని అనడం బాధ్యతారాహిత్యమన్నారు. 'పేదరికం నిర్మూలించే వరకు సంక్షేమం, సబ్సిడీల బాధ్యత పాలకులదే' అనే అంశంపై ఉభయ వ్యవసాయ కార్మిక సంఘాల(బీకేఎంయూ, ఏఐడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడారు. రైతులు, కార్మికుల వల్లనే దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందన్నారు. గ్రామీణ ఉపాధిహామీ పథకానికి కేటాయించింది రూ.86 వేల కోట్లయితే కార్పొరేట్లకు రూ.లక్షల కోట్లు రుణమాఫీ చేస్తున్నారని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ బాధ్యతాయుత స్థానంలోని న్యాయమూర్తులు శ్రామికులను అగౌరవపరచేలా వ్యాఖ్యానించడం దురదృష్టకరమన్నారు. వీరి వ్యాఖ్యలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు తిలోదకాలు ఇచ్చేలా ఉన్నాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ పేదల పట్ల న్యాయమూర్తుల వ్యాఖ్యలు సరికాదన్నారు. వ్యవసాయ కార్మిక సంఘాల నేతలు బి.వెంకటేశ్వర్లు, ఆవుల శేఖర్, దడాల సుబ్బరావు, కోటేశ్వరరావు, సీపీఐ, సీపీఎం నేతలు అక్కినేని వనజ, రమాదేవి పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో నేరాల అదుపు

● ఏలూరు రేంజి ఐజీ అశోక్‌కుమార్



స్టేషన్ ఆవరణలో మొక్క నాటుతున్న ఐజీ అశోక్‌కుమార్

పామర్రు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అందుబాటులోకి వచ్చిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో నేరాలు గతంతో పోల్చుకుంటే అదుపులోకి వచ్చాయని ఏలూరు రేంజి ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ తెలిపారు. పామర్రు సర్కిల్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన వార్షిక తనిఖీ చేశారు. సైబర్ నేరాల బారినపడి మోసపోకుండా ప్రజల్ని అప్రమత్తం చేసేందుకు గ్రామాల్లో అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహ విద్యార్థినుల భద్రత కోసం సీసీ కెమెరాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. గ్రామాల్లో సంబరాలు, జాతర్లలో అల్లరిమూకల ఆటలకు అడ్డుకట్ట వేసేందుకు, అసాంఘిక శక్తుల ఆగడాల నిరోధానికి డ్రోన్లు ఉపయోగపడుతున్నాయన్నారు. గ్రామాల్లో గంజాయి వినియోగం అరికట్టేందుకు ప్రత్యేక నిఘా బృందాల పర్యవేక్షణ కొనసాగిస్తామన్నారు. స్టేషన్లలో దీర్ఘకాలికంగా కొనసాగుతున్న పోలీస్ సిబ్బందిని బదిలీ చేయడం చేస్తామని తెలిపారు. ఏలూరు రేంజ్ పరిధిలో జిరాక్సు మిషన్ల ద్వారా నకిలీ కరెన్సీ తయారీ ముఠాలను గుర్తించేందుకు అవసరమైన చర్యలు పోలీస్ శాఖ చేపట్టిందన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణ కోసం తీసుకోవాల్సిన చర్యలను పోలీసులకు వివరించారు. ప్రజలు నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని కోరారు. స్టేషన్ ఆవరణలో ఆయన ఓ మొక్కను నాటారు. అనంతరం సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్పీ పి.గంగాధరరావు, డీఎస్పీ వి.ధీరజ్ వినీల్, సీఐ వి.శుభకర్, ఎస్సైలు రాజేంద్రప్రసాద్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

మహిళలకు ప్రత్యేక హెల్ప్ డెస్క్

● కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు



జంక్షన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ గంగాధర్‌రావు

హనుమాన్‌జంక్షన్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): తమ బాధలు చెప్పుకోవడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చే మహిళలకు ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ప్రతి పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేస్తున్నామని కృష్ణాజిల్లా ఎస్పీ ఆర్.గంగాధర్‌రావు తెలిపారు. వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం హనుమాన్‌జంక్షన్ పోలీస్ స్టేషన్‌ను ఆయన సందర్శించారు. రికార్డులు, రిసెప్షన్ కౌంటర్, పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఖాళీగా ఉన్న స్థలాన్ని, మరుగుదొడ్లను ఆయన పరిశీలించారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే మహిళలకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వ్యక్తిగత మరుగుదొడ్లు, తాగునీరు, తమ బాధలు చెప్పుకోవడానికి మహిళా కానిస్టేబుల్‌ను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మార్చి 8వ తేదీ వరకు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాల్లో నేరాలు బాగా తగ్గాయన్నారు. జంక్షన్, ఇతర రద్దీగా ఉన్న ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. డ్రోన్ కెమెరాల ద్వారా బ్లాక్‌స్పాట్లు గుర్తించి వాటి వద్ద ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. గంజాయి సరఫరాపై నిఘా టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గన్నవరం విమానాశ్రయం కారణంగా వీఐపీల రాకపోకలు సందర్భంలో గన్నవరం- జంక్షన్-ఏలూరు మధ్య రహదారి మార్గంలో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జంక్షన్ పీఎస్‌లో సిబ్బంది కొరతను రానున్న కొత్త రిక్రూట్‌మెంట్‌లో భర్తీ చేస్తామన్నారు. జంక్షన్ నూతన సర్కిల్ కార్యాలయం భవనం స్వాధీనం చేసుకోవడానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపామన్నారు. అనుమతి రాగానే భవనాన్ని ప్రారంభిస్తామన్నారు. గన్నవరం సీఐ ప్రసాద్, ఎస్సైలు వి.సురేశ్, లక్ష్మీనరసింహమూర్తి ఉన్నారు.

టమాటా కేజీ రూ. 4

● అమాంతం పడిపోయిన ధర
● కోత ఖర్చులైనా రావట్లేదని రైతుల విలవిల
● కోయకుండా తోటలు వదిలేస్తున్న వైనం

వేసవి ప్రారంభానికి ముందే టమాటా ధర అమాంతం పడిపోయింది. రైతుకు కిలో రూ.4 పలుకుతోంది. దీంతో రైతులు పంట కోయకుండానే తోటలను వదిలేస్తున్నారు. కొందరు దున్నేస్తున్నారు. కోత ఖర్చులు వచ్చే పరిస్థితి లేదని, అందుకే తోటలను వదిలేస్తున్నామని చెబుతున్నారు.



గడ్డమణుగు గ్రామంలో గంపా శ్రీనివాసరావు పొలంలో కోయకుండా వదిలేసిన టమాటా తోట

(జి.కొండూరు-ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లాలో మొత్తం 216 ఎకరాల్లో టమాటా సాగులో ఉంది. ఖరీఫ్‌లో వేసిన పంట చివరి కోత దశలో ఉంది. రబీలో సాగు చేసిన తోటల్లో మరో రెండు వారాల్లో కోతకు వచ్చే అవకాశం ఉంది. మైలవరం నియోజకవర్గంలో జి.కొండూరు మండలం గడ్డమణుగు, చెర్వుమాధవరం, గంగినేనిపాలెం, జి.కొండూరు, గుర్రాజుపాలెం గ్రామాల్లో ఖరీఫ్, రబీ కలిపి 31 ఎకరాల్లో, ఇబ్రహీంపట్నం మండలం కొటికలపూడి, మూలపాడు, దాములూరు గ్రామాల్లో 11 ఎకరాలు, గంపలగూడెం, తిరువూరు, విస్సన్నపేట, మైలవరం, జగ్గయ్యపేట మండలంలో చెదురుమదురుగా అన్నదాతలు టమాటాను సాగు చేస్తున్నారు. పంట కోసి విక్రయానికి తీసుకెళ్తే కేజీ రూ.4 పలుకుతోందని, ప్రభుత్వం నుంచి వస్తున్న విత్తన రాయితీతో పాటు మరిన్ని రాయితీలు వస్తేనే సాగు చేయగలమని రైతులు చెబుతున్నారు.

టమాటా రైతులకు పలు రాయితీలు ఉన్నాయి

టమాటా సాగుచేసే రైతుకు హెక్టారుకు రూ.3 వేలు విత్తన సబ్సిడీ వస్తోంది. ట్రెల్లీస్ పద్ధతిలో సాగు చేసుకుంటే ఎకరానికి రూ.18,500 రాయితీ వస్తుంది. మల్చింగ్‌కు రాయితీ వస్తుంది. నేల మీద పండే పంటకు ట్రెల్లీస్‌లో పండించే పంటకు నాణ్యత విషయంలో తేడా ఉంటుంది. నాణ్యమైన కాయలకే మంచి డిమాండ్ ఉంటుంది.

-నీలిమ, హెచ్‌వో

మార్కెట్‌లో మదనపల్లి ముందు నిలబడలేక..

మార్కెట్ హెచ్చుతగ్గులు, పోటీతత్వం కారణంగా ఈప్రాంతంలో రైతులు పండించే టమాటాలు బహిరంగ మార్కెట్‌లో మంచి ధర పలకడం లేదు. దీంతో రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. నాణ్యతలో చిత్తూరు, మదనపల్లి టమాటాల ముందు నిలబడలేకపోతున్నాయి. అక్కడి రైతులు ట్రెల్లీస్ సాగు ద్వారా కాయలను నాణ్యంగా పండిస్తున్నారు. తీగను కిందకు పాకకుండా, నేలపై కాయలు వాలకుండా సాగు చేస్తారు. దడి సాగు(ట్రెల్లీస్)లో కర్రలు పాతి ఐరెన్ ఫెన్సింగ్ తీగ కట్టి చెట్లను వాటికి పాకిస్తారు. దీంతో టమాటాలు నాణ్యంగా ఉంటున్నాయి. ఈప్రాంతంలోనూ ఇలా సాగు చేస్తే మార్కెట్ పోటీని తట్టుకుంటారని ఉద్యాన అధికారులు చెబుతున్నారు.

కోత ఖర్చులు రావడం లేదు



ధర కేజీ రూ.4 పలకడంతో కోత ఖర్చులు కూడా రావడం లేదు. 27 కిలోల ట్రే కోయించేందుకు రూ.40 ఖర్చవుతోంది. రవాణా తదితర ఖర్చులు కలిపితే నష్టమే వస్తోంది. అందుకే తోటలను వదిలేశాం. మరి కొందరు దున్నేస్తున్నారు.

-నూతక్కి నాగేశ్వరరావు, రైతు, గడ్డమణుగు

రాయితీలు ఇచ్చి ఆదుకోవాలి



టమాటా సాగు చేసే రైతులకు ప్రభుత్వం రాయితీలు పెంచాలి. పంట సాగు చేసే వారికి నష్టాలు తప్ప లాభాలు రావడం లేదు. మార్కెట్ సౌకర్యం కూడా తక్కువగా ఉంది. రైతు బజారుకు తీసుకెళ్లి అమ్ముకునే పరిస్థితి లేదు. జి.కొండూరులో రైతు బజారు ఏర్పాటు చేస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

- పాతూరి ఐమోహన్‌రావు, రైతు, గడ్డమణుగు

జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరు

● ప్రజలు దుస్తులూడదీసి ఆయనను ఇంట్లో కూర్చోబెట్టారు
● తప్పులు ప్రశ్నిస్తారనే అసెంబ్లీకి రావడం మానేశారు: మంత్రి కొల్లు రవీంద్ర

గుడివాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'మాజీ ముఖ్యమంత్రి జగన్ ఐ ప్యాక్ డ్రామాలు ప్రజలు నమ్మరు. ఇప్పటికే ప్రజలు దుస్తులూడదీసి ఆయనను ఇంట్లో కూర్చోబెట్టారు. అధికారంలో ఉండగా చేసిన తప్పులను ప్రశ్నిస్తారనే భయంతో జగన్ అసెంబ్లీకి రావడం లేదు. పోలీసులను బెదిరించి నీచ రాజకీయాలకు తెరలేపారు. మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ దళితుడిని కిడ్నాప్ చేస్తే కేసులు పెట్టరా?' అని మంత్రి కొల్లు రవీంద్ర అని ప్రశ్నించారు. శుక్రవారం ఏలూరురోడ్డులోని ప్రజావేదికలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మిర్చి రైతుల సమస్యలపై కేంద్ర మంత్రితో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారన్నారు. ఎన్నికల కోడ్ ఉందని అధికారులు చెప్పినా జగన్ తన రాజకీయ స్వార్థానికి మిర్చి యార్డుకు వెళ్లారని అన్నారు. మాజీ మంత్రి కొడాలి నాని వ్యాఖ్యలను పట్టించుకోవలసిన అవసరం లేదన్నారు. బూతులు మాట్లాడానికైతే నానీకి ఉద్యోగం అవసరమని, ప్రజాసేవ చేయడానికి అవసరం లేదని అని అన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా తాము ప్రజలకు జవాబుదారీగానే పని చేస్తున్నామని స్పష్టం చేశారు. అవినీతి, అరాచకాలు, విధ్వంసంతో నాశనమైన జిల్లా ఖ్యాతిని తిరిగి తీసుకొచ్చేందుకు తామంతా కష్టపడుతున్నామన్నారు. ఈ సమావేశంలో ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు, గిడ్డంగుల సంస్థ రాష్ట్ర చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సహజ నిక్షేపాలు కొల్లగొడుతున్నాయ్

● రోడ్లు, భూగర్భ జలాలు నాశనం చేస్తున్నాయ్
● గ్రామాలు అభివృద్ధి చేస్తామని అబద్ధపు హామీలిచ్చాయ్
● ఓఎన్జీసీ, మేఘా సంస్థలపై భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థుల ఆగ్రహం



తహసీల్దార్ హరనాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు

నాగాయలంక, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): 'సంగేగడ్డ రెవెన్యూ పరిధిలోని వక్కపట్లవారిపాలెం గ్రామంలోని ఓఎన్జీసీ, మేఘా సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ వద్ద ఆయిల్ నిక్షేపాల వెలికితీస్తున్నారు. ఏడేళ్ల క్రితం డ్రిల్లింగ్‌కు ముందు ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణలో స్థానిక గ్రామాల ప్రజలకు ఉపాధి కల్పిస్తామని, వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తామని, మౌలిక వసతులు కల్పిస్తామని, గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంస్థలు అబద్ధపు హామీలు ఇచ్చాయి. ఇప్పుడు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదు. ఆయిల్, గ్యాస్‌వంటి సహజ నిక్షేపాలను కొల్లగొట్టుకుపోతున్నాయి. రోడ్లను, భూగర్భ జలాలను నాశనం చేస్తున్నాయి.' అని భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయిల్ డ్రిల్లింగ్ రిగ్ నుంచి ముడిచమురును తీసుకెళ్లే భారీ వాహనాలు, ప్లాంట్ వద్ద వినియోగించే భారీ యంత్రాలు వల్ల స్థానిక రోడ్లు అధ్వానంగా మారాయని రెండు గ్రామాల ప్రజలు శుక్రవారం తహసీల్దార్ ఎం.హరనాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. గతంలో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు డ్రిల్లింగ్ పాయింట్ వద్ద ఆందోళనలు చేయగా సంస్థ యాజమాన్యాలు వక్కపట్లవారిపాలెం నుంచి భావదేవరపల్లి మధ్య ఉన్న ప్రధాన రహదారి నిర్మాణానికి శిలాఫలకాలు వేశాయి, కానీ అభివృద్ధి చేయలేదని వారు పేర్కొన్నారు. రహదారి మార్గం సరిగా లేకపోవటంతో గర్భిణులను ఆస్పత్రికి తరలించే సమయంలో పరిస్థితి విషమించి రెండు నిండు ప్రాణాలు కోల్పోయాయని గ్రామస్థులు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయిల్ డ్రిల్లింగ్ కారణంగా భూగర్భ జలాలు కలుషితమై చుట్టుపక్కల గ్రామాల్లో అనేక మంది క్యాన్సర్ బారిన పడి మృత్యువాత పడుతున్నారని, అయినా పట్టించుకోవటం లేదని తెలిపారు. ఏడేళ్లలో ఒక్కసారి కూడా చుట్టుపక్కల హెల్త్ క్యాంపులు నిర్వహించిన పాపాన పోలేదన్నారు. ఓఎన్జీసీ యాజమాన్యం సామాజిక బాధ్యతలో భాగంగా పరిసర ప్రాంతాలను అభివృద్ధి చేయకపోతే గ్రామస్థులతో కలిసి భారీ ఆందోళన చేస్తామని భావదేవరపల్లి, వక్కపట్లవారిపాలెం గ్రామస్థులు హెచ్చరించారు.

రోడ్డుకు తాత్కాలిక మరమ్మతులు చేయించుకుంటున్నాం



రహదారి మరమ్మతులు చేస్తున్న యంత్రం

సంక్రాంతి సమయానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి రాష్ట్రంలో గుంతలరోడ్లు కనిపించకుండా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఏ మార్పు జరగలేదని గ్రామస్థులు తెలిపారు. శిలాఫలకాలు వేసి రోడ్లు నిర్మాణం చేస్తామని ఆయిల్, గ్యాస్ వెలికితీతల సంస్థ వాగ్దానాలు ప్రకటనలకే పరిమితమయ్యాయని పేర్కొన్నారు. అందుకే గ్రామస్థులే చొరవ తీసుకుని పలువురి ఆర్థిక సహకారంతో రోడ్లకు తాత్కాలిక మరమ్మతులు చేయించుకుంటున్నామని వారు తెలిపారు.

వాతావరణ మార్పు సమస్యలకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కారం

● ప్రకృతి వ్యవసాయం బలోపేతానికి మద్దతిస్తాం
● పెగాసిస్ సంస్థ హామీ



కానుమోలులో 365డేస్ కిచెన్ గార్డెన్ నిర్వహిస్తున్న అనురాధతో మాట్లాడుతున్న పెగాసిస్ ప్రతినిధులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయం వైపునకు మళ్లేందుకు ఏపీసీఎన్ఎఫ్ (ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) అందిస్తున్న సహకారం అభినందనీయమని, వాతావరణ మార్పులకు ప్రకృతి వ్యవసాయమే పరిష్కార మార్గమని పెగాసిస్ కాపిటల్ అడ్వైజర్ జనా మెకార్తీ, సీఈవో క్రెయిగ్ కోగట్ అన్నారు. కానుమోలు, కాకులపాడులో ఏపీసీఎన్ఎఫ్, ఆర్‌వైఎస్ఎస్(రైతు సాధికార సంస్థ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అమెరికాకు చెందిన పెగాసిస్ కాపిటల్ సంస్థ బృంద సభ్యులు శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫుడ్ బాస్కెట్ ప్రాజెక్ట్‌లో భాగంగా కానుమోలులో అనురాధ నిర్వహిస్తున్న 365డేస్ కిచెన్‌గార్డెన్‌ను పరిశీలించారు. అవలంబించే విధానాలను అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ ఉత్పత్తులను పరిశీలించారు. ఆహారభద్రత పెంపొందించేందుకు స్వయం సహాయక సంఘాల ద్వారా నిర్వహిస్తున్న ఫుడ్ బాస్కెట్ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కాకులపాడులో పద్మరాగం నిర్వహిస్తున్న ఏ గ్రేడ్ ప్రకృతి వ్యవసాయ మోడల్‌ను, చింతయ్య నిర్వహిస్తున్న రసాయనిక వ్యవసాయ క్షేత్రాలను సందర్శించారు. వినూత్న విధానాలు ఆకట్టుకున్నాయని తెలిపారు. గ్రామీణుల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ, ఆరోగ్య ఖర్చులను ఆదా చేసేలా మహిళా స్వయం సహాయక సంఘాలు చేస్తున్న కృషి అభినందనీయమని వైట్‌హౌస్ మాజీ నేషనల్ క్లైమేట్ అడ్వైజర్ జినా మెకార్తీ కొనియాడారు. ప్రజలకు రసాయన రహిత ఆహారాన్ని అందించేందుకు ప్రకృతి వ్యవసాయంలో స్థిరమైన పెట్టుబడులకు అవకాశాలు కలించడానికి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. రైతు సాధికారత సంస్థ జిల్లా ప్రాజెక్ట్ ఆఫీసర్ పార్థసారథి, అరుణ, విషి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి పద్మావతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోండి

● పోలీసు, రవాణా అధికారులతో కృష్ణా కలెక్టర్ బాలాజీ



మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): కృష్ణా జిల్లాలో రహదారుల వెంబడి ప్రమాదాలు జరగకుండా పోలీస్, రవాణా శాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ బాలాజీ సూచించారు. జిల్లా రహదారి భద్రతాకమిటీ సమావేశం శుక్రవారం కలెక్టర్ చాంబరులో నిర్వహించారు. ప్రయాణ సమయంలో ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపేవారు సీటుబెల్టు ధరిస్తే ప్రమాదాలు జరిగిన సమయంలో ప్రాణనష్టం తక్కువగా ఉంటుందని కలెక్టర్ అన్నారు. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో 90రోడ్డు ప్రమాదాలు జరిగాయని, 41 మరణాలు సంభవించాయని, 76మంది గాయపడ్డారని తెలిపారు. ఈ లెక్కలు ఆందోళన కలిగించే విధంగా ఉన్నాయన్నారు. జాతీయ రహదారులపై వాహనాల వేగాన్ని కనిపెట్టేందుకు అధునాతన సీసీ కెమెరాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. అతివేగంతో వాహనాలు నడిపేవారిని గుర్తించి జరిమానాలు భారీగా విధించాలన్నారు. మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద జాతీయరహదారి నుంచి విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని, అక్కడ వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు తగు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. మచిలీపట్నం నగరంలో వివిధ వేడుకల సమయంలో ఫ్లెక్సీలు భారీ ఎత్తున ఏర్పాటు చేస్తున్నారని, కార్యక్రమాలు ముగిసిన వెంటనే ఫ్లెక్సీలను తొలగించాలని మునిసిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. మచిలీపట్నం నగరంలో రహదారుల వెంబడి పశువుల సంచారం అధికంగా ఉందని, వాటి కొమ్ములకు రేడియం పెయింట్ వేయించాలని సూచించారు. హెల్మెట్ ధరించడం మూడురోజుల ముచ్చటగా కాకుండా నిత్యం వాడేలా ప్రజలను చైతన్యవంతం చేయాలని ఆయన అధికారులకు సూచించారు. జిల్లా రవాణాశాఖ అధికారి బీఎస్ఎస్ నాయక్, ఎంవీఐ ఎల్.సిద్ధిక్, మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు, డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్ట, ఆర్‌అండ్‌బీ విభాగం ఈఈ లోకేష్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ధనుంజయుడి విగ్రహాన్ని అసెంబ్లీ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలి

గాంధీనగర్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): తొలి తెలుగు శాసన కర్త రేనాటి చోళరాజు ఎరి(కల్) ముత్తురాజు ధనంజయుడి విగ్రహాన్ని శాసన సభ ప్రాంగణంలో ప్రతిష్ఠించాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. క్రీ.శ 575 సంవత్సరంలోనే తెలుగు భాషను రాజభాషగా చేసి తొలి తెలుగు శాసనాన్ని ఆయన చెక్కించారని పేర్కొన్నారు. తొలి తెలుగు దివ్వె తెలుగు మూలాల అధ్యయన సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవ వేడుకలు గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం నిర్వహించారు. తొలుత ధనుంజయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. క్రీ.శ 6 నుంచి 10వ శతాబ్దం వరకు తెలుగు భాషను రాజభాషగా కొనసాగించి తెలుగును ధనుంజయుడు అభివృద్ధి చేశారని సంఘం అధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి తెలిపారు. ఆయనకు భారతరత్న ప్రకటించాలన్నారు. దేశంలోనే తొలిసారిగా తెలుగు పుట్టుక- వ్యాప్తి గురించి ఏప్రిల్ 20న హైదరాబాద్‌లో మహాసభ నిర్వహిస్తున్నట్టు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పీవీఎల్ఎన్.రాజు తెలిపారు. సీనియర్ జర్నలిస్టు చలపతిరావు, సంస్కార భారతీ అధ్యక్షుడు, ప్రముఖ రచయిత, దర్శకుడు, 14 నంది అవార్డుల గ్రహీత డాక్టర్ పీవీఎస్.కృష్ణను ఘనంగా సత్కరించారు. డాక్టర్ వెలగ జోషి, గోళ్ల నారాయణరావు, జీఆర్కే, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కె.జయరాజ్, చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాతృభాషా సేవకులకు సత్కారం

విజయవాడ కల్చరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రం తెలుగు తల్లి విగ్రహం వద్ద తెలుగు కోసం వివిధ రంగాలలో సేవలందించిన తెలుగు కళావాహిని, జీఆర్కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంస్థల ప్రతినిధులు గోళ్ల నారాయణరావు, శింగంశెట్టి చంద్రశేఖర్, బండారు నరసింహారావు, డేవిడ్ రాజు, మద్దెల శ్యాంప్రసాద్, పిల్లి లక్ష్మీతులసి, డాక్టర్ బెనర్జీ, బసవరాజు, గొంట్ల రామ్మోహనరావులను సత్కరించారు. చింతకాలయ చిట్టిబాబు పర్యవేక్షించారు. భారత మహిళా మండలి అధ్యక్షురాలు ఆర్.శ్రీలక్ష్మీ దేవి, కార్యవర్గసభ్యులు పి.శశిరేఖ, వి.కామేశ్వరి, శచిదేవి, ఎ.రత్నలక్ష్మి, టి.సాయిలక్ష్మి, జీవీఎల్ కుమారిని సత్కరించారు.

తాళాలు వేసిన ఇళ్లే లక్ష్యం

● పట్టపగలే మూడిళ్లలోకి ప్రవేశించిన దొంగలు.. బంగారం, నగదు అపహరణ

నందిగామ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూనగర్‌లో శుక్రవారం మధ్యాహ్నం తాళాలు వేసి ఉన్న మూడు ఇళ్లలోకి దొంగలు చొరబడ్డారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకొని పట్టపగలే దోపిడీకి తెగబడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నెహ్రూనగర్‌లోని బీసీ హాస్టళ్ల సమీపంలో ఉంటున్న ఇసుక మునిరెడ్డి ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా షాపు వద్దకు వెళ్లారు. తాళం పగులగొట్టి ఇంట్లోకి చొరబడిన దొంగలు రూ.మూడు లక్షల విలువైన బంగారు నగలు, రూ.ముప్పై వేల నగదు అపహరించారు. అదే వీధిలో ఉంటున్న ఉపాధ్యాయుడు కొణకాల బాలశౌరి ఇంటి తాళం పగులగొట్టి లోనికి ప్రవేశించిన దొంగలు 18 గ్రాముల బంగారం అపహరించారు. పక్కనే ఉన్న లారీ డ్రైవర్ కూనపనేని శ్రీనివాసరావు ఇంట్లోకి కూడా చొరబడిన దొంగలు బీరువా తాళాలు పగులగొట్టారు. ఆ ఇంట్లో ఏమీ చోరీ చేయలేదు. సీఐ వైవి లచ్చునాయుడు సిబ్బందితో వెళ్లి ఘటనా స్థలాలను పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిలకడగా చిన్నారుల ఆరోగ్యం

● 11 మంది డిశ్చార్జ్, మరో ఇద్దరికి చికిత్స

ఎ.కొండూరు, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని చీమలపాడు శివారు పెద్దతండాలోని అంగన్వాడీ కేంద్రంలో అపరిశుభ్ర వాతవరణంలో ఆహారం తిన్న 13 చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉందని వైద్యులు, అంగన్వాడీ సూపర్‌వైజర్ శివకుమారి తెలిపారు. 11 మంది పిల్లలను శుక్రవారం డిశ్చార్జి చేశారు. జరబల యశ్వంత్‌సాయి, గుగ్గులోతు సాయిదినేష్‌కు విరేచనాలు తగ్గకపోవడంతో రెండు రోజులు చికిత్స చేయాలని వైద్యులు సూచించారు. ఫుడ్‌సేఫ్టీ అధికారులు పెద్ద తండా అంగన్వాడీ కేంద్రంలోని గుడ్లు, పప్పు, నీరు శాంపిల్ తీసుకున్నారు. ల్యాబ్ టెస్టింగ్ అనంతరం చిన్నారుల అస్వస్థతకు కారణం తెలుస్తుందని వైద్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడి దుర్మరణం

మైలవరంరూరల్, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఆరేళ్ల బాలుడు మృతిచెందిన ఘటన మండలంలోని వెల్వడం గ్రామ శివారు ఇటుక బట్టీల వద్ద గురువారం అర్థరాత్రి జరిగింది. బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం పెద్దపాలెం గ్రామానికి చెందిన ఎందుమూరి రవి రెండు నెలల క్రితం తోలుకోడు రోడ్డులో ఉన్న ఇటుక బట్టీల్లో పని చేసేందుకు కుటుంబంతో కలిసి వచ్చాడు. బట్టీల వద్ద పాకలు వేసుకొని నివసిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి టేబుల్ ఫ్యాన్ వైర్లు లీకై మంటలు వచ్చాయి. దీంతో నిద్రిస్తున్న రవి మేల్కొని కేకలు వేశాడు. కుటుంబసభ్యులు కేకలు విని నిద్ర లేచారు. కుమారుడు యశ్వంత్ ఏదో జరుగుతుందని ఫ్యాన్ వద్దకు వెళ్లాడు. వైర్లు తగిలి కిందపడ్డాడు. కుమారుడిని కాపాడే ప్రయత్నంలో తండ్రికీ గాయాలయ్యాయి. మైలవరం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే బాలుడు మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రవిని స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రవికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమారుడు మృతిచెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 440

మూడు రాజధానుల కేసులో కోర్టుకు రావి హాజరు



గుడివాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వంలో మూడు రాజధానులు వద్దు - అమరావతి ముద్దు అనే ఆందోళనలో పాల్గొన్న అప్పటి మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు సహా పలువురు టీడీపీ నాయకులపై పోలీసులు కేసు నమోదు చేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, గుడివాడ, గుడ్లవల్లేరు టీడీపీ నాయకులు శుక్రవారం గుడివాడలోని ఏజేఎఫ్‌సీఎం కోర్టుకు హాజరయ్యారు.



కూచిపూడి కళాపీఠంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాట్యాచార్యులు



గుడివాడలో జరిగిన వేడుకల్లో రామారావును సత్కరిస్తున్న ఒన్‌టౌన్ సీఐ శ్రీనివాస్

ఘనంగా మాతృభాషా దినోత్సవం

కూచిపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కూచిపూడి సిద్ధేంద్ర కళాపీఠం, మొవ్వ వీఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ప్రపంచ మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగుభాష గొప్పదనం, ఔన్నత్యం, తెలుగుభాషకు కృషి చేసిన కవులు, కళాకారులను మననం చేసుకున్నారు. కూచిపూడి కళాపీఠంలో తెలుగుతల్లి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. నాట్యాచార్యులు డాక్టర్ చింతా రవిబాలకృష్ణ, యేశ్వరపు శ్రీనివాస్, సిబ్బంది పాల్గొనగా, మొవ్వలో జరిగిన కార్యక్రమంలో అధ్యాపకులు జగదాంబిక, ఎంఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

ఉరిటి రామారావుకు సత్కారం

గుడివాడ : తెలుగు భాషా సమితి అధ్యక్షుడు డీఆర్‌బీ ప్రసాద్ ఆధ్వర్యంలో చైతన్య భారతీ విద్యానికేతన్‌లో శుక్రవారం అంతర్జాతీయ మాతృ భాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీవివేకానంద సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఉరిటి రామారావుకు ఎంఆర్ నాగేశ్వరరావు సాహితీ స్ఫూర్తి పురస్కారం- 2025ను ఒన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అందజేశారు. గుడివాడ వాకర్స్ అధ్యక్షుడు డి.వి.సత్యనారాయణ, రచయిత్రి కైకాల సుమ, మహిళ వాకర్స్ అధ్యక్షురాలు దీవెన, కార్యదర్శి ప్రతిమ, వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో తెలుగు విభాగం, అక్కినేని కళాపీఠం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యాసరచన, ముచ్చటగా మూడు నిమిషాలు తెలుగులో మాట్లాడటం పోటీలను నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాలకవర్గ కార్యదర్శి కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్.పి.జె.ఎస్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ, తెలుగు విభాగాధిపతి డాక్టర్ ప్రత్యూష, అధ్యాపకులు సువర్ణలక్ష్మీ, సుకీల, నవీన్‌కుమార్ పాల్గొన్నారు.





ఆలపాటిని గెలిపించాలని గుడివాడలో ప్రచారం చేస్తున్న మంత్రి రవీంద్ర, గుడ్లవల్లేరులో ఎమ్మెల్యే వెనిగండ్ల ప్రచారం



బొడ్డపాడు పాఠశాలలో ప్రచారం చేస్తున్న గురుమూర్తి, సర్పంచ్ శివశంకర్

ఆలపాటి వంటి ఉత్తముడిని గెలిపించాలి

గుడివాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్రప్రసాద్ వంటి మంచి వ్యక్తి చట్టసభల్లో ఉండాలని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆర్టీసీచైర్మన్ కొనకళ్ల నారాయణరావు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే వెనిగండ్ల రాములతో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పట్టభద్రులు ఆలపాటికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, జనసేన జిల్లా కన్వీనర్ బండి రామకృష్ణ, నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, అర్బన్ బ్యాంకు మాజీ చైర్మన్ పిన్నమనేని బాబ్జీ, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో మంత్రి రవీంద్ర, కొనకళ్ల, వెనిగండ్ల, రావి

గుడ్లవల్లేరు : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ కు ప్రథమ ప్రాధాన్యతా ఓటును వేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. శుక్రవారం సాయంత్రం గుడ్లవల్లేరులో పట్టభద్రులను కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. తొలుత గ్రామంలో మూడు, నాల్గు వార్డుల్లో పర్యటించిన ఎమ్మెల్యేకు ఆ ప్రాంత ప్రజలు డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాల సమస్యలను చెప్పారు. ప్రజలు తన దృష్టికి తెచ్చిన సమస్యలను సావధానంగా విన్న ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి సూచనలు చేశారు. అనంతరం పట్టబద్రుల ను కలిసి ఓట్లను అభ్యర్థించారు. మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, పోలవరపు వెంకటరావు, మురాల నరేష్, గోపాల్,రాంబాబు,ప్రసాద్,చిన్ని, నవాబు, రమేష్, జాని, రంగబాబు తదితరులు పాల్గొన్నారు.పెదపారుపూడి : వానపాముల విశ్వభారతి వైస్ వుడ్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి ఆధ్వర్యంలో కూటమి నేతలతో కలిసి ఆలపాటి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం చేశారు. పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా సోదరుడువర్ల చాణిక్య పాల్గొని మాట్లాడుతూ విద్యావంతుడైన ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ గెలుపుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ వల్లూరుపల్లి గణేష్, కుదరవల్లి ప్రవీణ్ చంద్ర, చలసాని రమేష్ చౌదరి, జక్కా శ్రీనివాసరావు, చప్పిడి కిషోర్, దాలిపర్తి ప్రసాద్‌తోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గురుమూర్తి ప్రచారం

తోట్లవల్లూరు : అందరికి అందుబాటులో ఉండే మంచి మనిషిగా గుర్తింపు తెచ్చుకున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిపించాలని ఉపాధ్యాయులను, ఉద్యోగులను రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి కోరారు. వల్లూరుపాలెం, బొడ్డపాడు, రొయ్యూరు తదితర గ్రామాల్లో శుక్రవారం పర్యటించి పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలను సందర్శించి ఉద్యోగులను ఓట్లు అభ్యర్థించారు. సర్పంచ్ మూడే శివశంకర్, కొత్తపల్లి కిరణ్ తదితర నాయకులు గురుమూర్తి వెంట ప్రచారంలో పాల్గొన్నారు. పెనమకూరు జడ్పీ హైస్కూల్లో మండల టీడీపీ అధ్యక్షుడు వీరపనేని శివరామ్‌ప్రసాద్, రిటైర్డ్ ఎం ఈవో పి వెంకట్రామయ్య తదితరులు ఆలపాటి గెలుపు కోరుతూ టీచర్లను ఓట్లు అభ్యర్థించారు.



గంజాయి కేసులో నిందితులను చూపుతున్న సీఐ కొండపల్లి శ్రీనివాస్

గంజాయి స్వాధీనం .. ముగ్గురి అరెస్టు

గుడివాడ, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి) : గంజాయి అమ్మకాలను ఉక్కుపాదంతో అణిచి వేస్తామని ఒన్‌టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. లింగవరం రోడ్డులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 1700 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకుని తహసీల్దార్ రామకోటేశ్వరరావు సమక్షంలో నందం సూర్య, పులవర్తి రోహిత్, బండి తంబిలను అదుపులోకి తీసుకున్నామన్నారు. మరో వ్యక్తి రాజా వెంకట్ తప్పించుకున్నాడన్నారు. గుడివాడ రైల్వే స్టేషన్ వద్ద షేక్ జానీ వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు తెలిపారు. గంజాయి అమ్మినా, తరలించినా కఠిన చర్యలు తప్పవని సీఐ శ్రీనివాస్ హెచ్చరించారు. ఈ సమావేశంలో తాలుకా ఎస్.ఐ ఎన్.చంటిబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మొవ్వలో సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజనల్ పంచాయతీ అధికారిణి సంపత్ కుమారి

గ్రామాలను చెత్తరహితంగా తీర్చిదిద్దుదాం

● డివిజనల్ పంచాయతీ అధికారి సంపత్ కుమారి

కూచిపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): గ్రామాలను చెత్త రహితంగా తీర్చిదిద్ది మండలాన్ని జిల్లాలో అగ్రభాగాన నిలిపేందుకు కృషి చేయాలని గుడివాడ, ఉయ్యూరు డివిజనల్ పంచాయతీ అధికారి జి.సంపత్ కుమారి పిలుపునిచ్చారు. మొవ్వలో శుక్రవారం చెత్త సేకరణపై శిక్షణా తరగతుల్లో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పంచాయతీ సిబ్బంది తడి, పొడి చెత్తపై దృష్టిసారించి వాటిని సంపద తయారీ కేంద్రాలకు తరలించాలన్నారు. గ్రామస్థులు, అధికారులు, ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలన్నారు. స్వచ్ఛ గ్రామాలుగా, చెత్త రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకుని స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈవోపీఆర్డీ పరమాత్మ, మేజర్, మైనర్ గ్రామపంచాయతీల కార్యదర్శులు, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, డిజిటల్ అసిస్టెంట్లు, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

మినుమును పరిశీలించిన శాస్త్రవేత్తలు





మినుమును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, పక్కన మినపతీత తీస్తున్న కూలీలు

కూచిపూడి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు మొవ్వ మండలంలోని కోసూరు గ్రామంలో మినుము పైరును పరిశీలించారు. కో-ఆర్డినేటర్ డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ జిల్లాలో అన్ని ప్రాంతాలలో మినుము పంటకు అధికంగా రసాయన మందులు, బలం మందులను కలపి పిచికారి చేస్తున్నారన్నారు. వీటిని అధిక మోతాదులో వినియోగంచటం వల్ల పైరు ఏపుగా పెరిగి పూత రావటం ఆలస్యమవుతోందన్నారు. చీడ పీడల నివారణకు శాస్త్రవేతలు సూచించిన రసాయన మందులు కూడ నిర్దేశించిన మోతాదులోనే పిచికారి చేసుకోవాలని తెలిపారు. మినుములో పేనుబంక, ఎర్రనల్లి ఉధృ తి అధికంగా ఉందని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ రేవతి, డాక్టర్ వెంకటలక్ష్మి, రైతులు పాల్గొన్నారు.

మినపతీతలు ప్రారంభం

మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో మినప తీతలు ప్రారంభమయ్యాయి. మినప తీతలు తీసేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను రైతులు తీసుకువచ్చారు. ఈ ఏడాది కూలీల ఖర్చు గణనీయంగా పెరిగినట్లు రైతులు పేర్కొంటున్నారు. ఒక కూలీకి రోజుకు భత్యం ఇచ్చి రూ.700 చెల్లిస్తున్నట్లు తెలిపారు. పురుగు మందుల పిచికారీ, మినప పంట తీయటానికి కూలీల ఖర్చుతో ఈ ఏడాది ఖర్చులు అధికమైనట్లు రైతులు పేర్కొంటున్నారు.

కారకంపాడు, కూచిపూడి, పెదపూడి, మొవ్వ, భట్లపెనుమర్రు, పెడసనగల్లు తదితర గ్రామాల్లో మినపతీతలు ఊపందుకున్నాయి.

ఫ్రూట్ దుకాణాలను క్రమబద్ధీకరించుకోవాలి

గుడివాడ, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రహదారి మార్జిన్‌లలో వ్యాపారం నిర్వహించుకునే ఫ్రూట్ దుకాణాలను క్రమబద్ధీకరించుకోవాలని ట్రాఫిక్ ఎస్.ఐ ప్రసాదరావు అన్నారు. జిల్లా ఎస్పీ గంగాధరరావు ఆదేశాలమేరకు డీఎస్పీ ధీరజ్ వినీల్ ఆధ్వర్యంలో శుక్రవారం రహదారి మార్జిన్‌లోని ఫ్రూట్‌దుకాణాల క్రమబద్ధీకరణపై అవగాహనకల్పించారు.

25నుంచి శివరాత్రి మహోత్సవాలు

గుడివాడ : ఈ నెల 25 నుండి 27వ తేదీవరకు నిర్వహించబడు వార్షిక మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా 26వ తేదీన నిర్వహించే స్వామి,అమ్మవార్ల దివ్య కళ్యాణ మహోత్సవంలో పాల్గొనే భక్తులు రూ.2116ల మాత్రమే చెల్లించాలని కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టైపింగ్ పొరపాటు కారణంగా రూ.2116లకు బదులు రూ.21,116లుగా పత్రిక ప్రకటన విడుదలలో తప్పు దొర్లిందన్నారు. జరిగిన పొరపాటుకు చింతిస్తున్నామని, రూ.2116లు మాత్రమే చెల్లించి కళ్యాణ మహోత్సవంలో పాల్గొనాలని, భక్తులు అన్యథ భావించకుండా సహకరించాలని, దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.వి గోపాలరావు కోరారు.

మస్త్-2025లో ఏఎన్ఆర్ విద్యార్థి ప్రతిభ



ఏఎన్ఆర్ కళాశాల విద్యార్థి సుధీర్

గుడివాడ : స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎంబీఏ ప్రథమ సంవత్సర విద్యార్థి ఎం.సుధీర్ మిస్టర్ మస్త్-2025 పోటీల్లో ఉత్తమ ప్రదర్శనకారుడుగా నిలిచినట్టు కళాశాల ప్రిన్సిపాల్ డా.పీజేఎస్ కుమార్ తెలిపారు. శుక్రవారం స్థానిక కళాశాల ఆవరణలో సుధీర్‌ను ఆయన అభినందించారు. సుధీర్‌ను కళాశాల పాలకవర్గ అధ్యక్ష,కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కె.ఎస్ అప్పారావు, కోశాధికారి పర్వతనేని కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ బి.ఎస్.ఎస్ పద్మజ ఎం.బి.ఎ విభాగాధిపతి డా.సువర్చల, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పీడీఎఫ్ అభ్యర్థి గెలుపునకు ప్రజాసంఘాల ప్రచారం

గుడివాడ : కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం సీఐటీయు, ప్రజాసంఘాల నాయకులు స్థానిక ప్రాంతీయప్రభుత్వాసుపత్రిలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్‌సీపీ రెడ్డి మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా పట్టభద్రుల, ఉపాధ్యాయుల సమస్యలపై లక్ష్మణరావు పోరాడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు ఆర్.కొండ, లంకా సురేంద్ర, విజయ్‌కుమార్, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

మెగా ఉచిత వైద్య శిబిరం నేడు

గుడ్లవల్లేరు :లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో 22వతేదీ శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నామని క్లబ్ అధ్యక్ష్యురాలు నిమ్మగడ్డ శశికళ తెలిపారు. కేర్ టూ యాక్షన్ సంస్థ వారి నిర్వహణలో విజయవాడకు చెందిన సుధా ఫర్టిలిటీ హాస్పిటల్ వైద్య బృందంచే గైనకాలజీ, చిల్డ్రన్స్, ఆర్థోపేడిక్, జనరల్ ఫిజీషియన్, షుగరు వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నారు. అవసరమైనవారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని ఆమె తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరి : భాను ప్రకాష్

నందివాడ: సొంత భూమిగల ప్రతీ రైతూ రైతు సేవా కేంద్రాల్లో గ్రామ వ్యవసాయ సహాయకుల ద్వారా విశిష్ట సంఖ్య నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఎస్.భాను ప్రకాష్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పెదలింగాల రైతు సేవా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించారు. సొంత భూమి గల రైతులకు ఆధార్ తరహా యూనిక్ ఐడి నమెదు చేయాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. ఈ నెల 25వ తేదీ లోపు రైతు సేవా కేంద్రాలలో నమోదు చేయించుకోవాలని కోరారు. గ్రామ వ్యవసాయ సహాయకులు కోటి నాగులు, గ్రామస్థులు, రైతులు పాల్గొన్నారు.

సిమెంట్ బల్లల వితరణ

పమిడిముక్కల :కపిలేశ్వరపురంలోని ఆలయాల ప్రాంగణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో సిమెంట్ బల్లలు శుక్రవారం ఏర్పాటుచేశారు. గీతామందిర్, రామాలయం ఇతర ఆలయాల ఆవరణలో భక్తులు కూర్చునేందుకు సిమెంట్ బల్లలను ఎస్‌బీఐ మేనేజర్ జీవీ సుబ్బారావు ద్వారా అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా కపిలేశ్వరపురం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సేవాకార్యక్రమాలు చేపట్టడం అభినందనీయ మన్నారు. క్లబ్ అధ్యక్షుడు కడియాల ప్రకాశరావు, కోశాధికారి జగదీశ్, ఉపాధ్యక్షుడు తాతినేని సాయిదత్, సభ్యులు శ్రీకృష్ణ బ్రహ్మానందరావు పాల్గొనగా కార్యదర్శి వెంకట గంగాధరరావు దాతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆగిన బస్సు .. ఆందోళనలో ప్రయాణికులు



ఆగిపోయిన ఆర్టీసీ బస్సు

పెదపారుపూడి: గుడివాడ నుంచి విజయవాడ వెళ్లే ప్రయాణికుల అవస్థలు అంతా ఇంతా కాదు. శుక్రవారం ఉదయం భీమవరం నుంచి విజయవాడ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ భూషణగుళ్ల అమ్మ అపార్ట్‌మెంట్స్ దగ్గర బస్సులో సాంకేతిక లోపాలు ఏర్పడి ఆగిపోయింది. దీంతో ప్రయాణికులు వేరే బస్సు కోసం రోడ్డుపైనే పడిగాపులు కాయాల్సి వచ్చింది

ఐలూరు రీ సర్వే వివరాల తనిఖీ

తోట్లవల్లూరు : ఐలూరులో చేపట్టిన రీ సర్వే వివరాలను జాయింట్ డైరెక్టర్(ప్రాజెక్ట్) నిహంత్‌రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన ఐలూరులోని వీఆర్వో కార్యాలయానికి వచ్చి ల్యాప్‌ట్యాప్‌లో అప్‌లోడు చేసిన రీసర్వే వివరాలను పరిశీలించారు. రీ సర్వేలో ఎలాంటి సమస్యలున్నా తనకు లెటర్ ద్వారా తెలియజేస్తే తగిన సలహాలు ఇస్తామన్నారు. మండల సర్వేయర్ రామకృష్ణ, రీ సర్వే డిటి వెంకటేశ్వరరావు, విఆర్వో శ్రీనివాసరావు, గ్రామ సచివాలయాల సర్వేయర్లు పాల్గొన్నారు.

సెస్సు బకాయిలు చెల్లించాలి

పమిడిముక్కల :స్థానిక సంస్థల నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థకు రావలసిన సెస్సు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు సాలర్ షరీఫ్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీని కలసి వినతిపత్రం అందజేశారు.గ్రామపంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పోరేషన్ల ద్వారా రావలసిన సెస్సు బకాయిలు చెల్లించేలా చర్యలు తీసుకుని గ్రంథాలయాల అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. ఉమ్మడిజిల్లా గ్రంథాలయ ఉద్యోగుల సఘం అధ్యక్షుడు కె కృ పానందం, ప్రధాన కార్యదర్శి ఎస్ చిన్నరాజు, మహిళా అధ్యక్షురాలు కోగంటి పద్మావతి, అసోసియేట్ అధ్యక్షుడు కేవీ సుబ్రహ్మణ్యేశ్వరరావు, ట్రెజరర్ రహీం, గౌరవ అధ్యక్షుడు తోకల రాంబాబులు కలెక్టర్‌ను కలసినట్టు తెలిపారు.

అష్టలక్ష్మి అమ్మవారికి విశేష పూజలు

గుడివాడ రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): చిన ఎరుకపాడు గ్రామంలో వేంచేసి ఉన్న అష్టలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు.







బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	90, 99, 110
చికెన్ విత్ స్కిన్	170
చికెన్ స్కిన్‌లెస్	180

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.440



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి సేవలో కేంద్ర బృందం

మోపిదేవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని క్యాట్ సభ్యులు (కేంద్ర బృందం) లతా బి.పాత్రే, శాలిని మిశ్రా, క్యాట్ రిజిస్ట్రార్ జి.నవీన్ కుమార్ శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలు పోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలతో వారిని సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



లంకపల్లిలోని సంపద కేంద్రంలో సేకరించిన చెత్తను పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాజలాజీ



మాజేరులో పర్యటిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



రైతుల నుంచి టమాట కొనుగోలు చేస్తున్న మార్కెటింగ్ శాఖాధికారులు

తడి, పొడి చెత్త వేర్వేరుగా అందజేయాలి

• లంకపల్లి, మాజేరు గ్రామాల్లో కలెక్టర్ డీకే బాలాజీ పర్యటన

ఘంటసాల, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : లంకపల్లిలోని సంపద సృష్టి కేంద్రాన్ని కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం సందర్శించారు. గ్రామంలోని ఇళ్ల నుంచి తీసుకువచ్చిన తడి, పొడి చెత్తను పరిశీలించారు. గ్రీన్ అంబాసిడర్లతో మాట్లాడి తడి, పొడి చెత్తను ఏ విధంగా సేకరిస్తున్నదీ తెలుసుకున్నారు. ప్రజల్లో మరింత అవగాహన కల్పించి తడి, పొడి చెత్త వేర్వేరుగా అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈవోపీఆర్డీ కె.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి కె.నాగ నాంచారమ్మ, కె.పద్మారావు, గ్రీన్ అంబాసిడర్లు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మాజేరులో పర్యటన..

చల్లపల్లి : కలెక్టర్ డీకే బాలాజీ శుక్రవారం మాజేరులో పర్యటించారు. గ్రామంలో పర్యటించిన కలెక్టర్ తడి, పొడి చెత్త వేర్వేరుగా చెత్తను ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సంపద తయారీకేంద్రాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు అందించారు. పాఠశాలకు వెళుతున్న చిన్నారులతో కలెక్టర్ మాట్లాడారు. ఈవోఆర్డీ వి.రవిశంకర్, ఇన్‌చార్జి కార్యదర్శి రాంబాబు, చల్లపల్లి కార్యదర్శి పివి.మాధవేంద్రరావు, వీఆర్వో పి.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌తో విద్యుత్ ఆదా

మచిలీపట్నం టౌన్ : పీయం సూర్య ఘర్ వల్ల విద్యుత్ ఆదా చేయవచ్చని డీఆర్వో చంద్రశేఖర్ అన్నారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల ఉద్యోగులతో డీఆర్వో సూర్యఘర్ ప్రయోజనాలు వివరించారు. సౌరశక్తితో విద్యుత్ తయారీ వల్ల పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చన్నారు. మెప్మా పీడీ, డీఆర్‌డీఏ ఇన్‌చార్జి పీడీ పి.సాయిబాబు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం సూర్య ఘర్‌కింద సబ్సిడీపై రుణ సౌకర్యం కల్పిస్తుందన్నారు. కలెక్టరేట్ ఏవో వీరాంజనేయ ప్రసాద్ వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధరకు టమాట కొనుగోళ్లు

మోపిదేవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : లంక గ్రామాల్లో సాగు చేస్తున్న టమాట పంటను గిట్టుబాటు ధర చెల్లించి మార్కెటింగ్ శాఖ నేరుగా కొనుగోలు చేస్తున్నట్లు ఏడీ ఎల్.నిత్యానందం తెలిపారు. కోసూరువారిపాలెంలో రైతుల నుంచి నేరుగా మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో టమాట పంట కొనుగోలు చేశారు. కేజీ రూ.8 చొప్పున 10 టన్నుల టమాట కొనుగోలు చేయటం జరిగిందన్నారు. రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేసి ఎన్టీఆర్, కృష్ణాజిల్లాలోని మార్కెట్‌కు తరలించనున్నట్లు ఆయన తెలిపారు. ప్రస్తుతం రోజు విడిచి రోజు రైతుల కోరిక మేరకు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. దళారులను నమ్మి రైతు లు మోసపోవద్దన్నారు. ప్రభుత్వమే గిట్టుబాటు ధర చెల్లించి కొనుగోలు చేస్తుందన్నారు. అవనిగడ్డ మార్కెటింగ్ శాఖ కార్యదర్శి కె.ఆనంద్, గుడివాడ, మచిలీపట్నం రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్లు అమీర్ బాబు, బలిచక్రవర్తి, గ్రామసచివాలయ, ఉద్యాన శాఖ సహాయక సిబ్బంది పాల్గొన్నారు.



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినికి, తల్లిదండ్రులకు జ్ఞాపిక, నగదు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకోవాలి

చల్లపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : యువత వివేకానందుని స్ఫూర్తిగా తీసుకుని, క్రమశిక్షణ, పట్టుదలతో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ పేర్కొన్నారు. శ్రీవివేకానంద డిగ్రీ కళాశాల, విజయ జూనియర్ కళాశాలల 33వ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. వైద్యశాస్త్రంలో నిష్ణాతులైన డాక్టర్ కాకర్ల సుబ్బారావు, ఆర్థికవేత్తగా పేరొందిన వివి.రామనాథం చల్లపల్లిలో చదువుకున్నవారేనన్నారు. మాతృభాషా దినోత్సవ ప్రా ముఖ్యతను వివరిస్తూ మాతృభాషను మరిచిపోవద్దని సూచించారు. కళాశాల కరస్పాండెంట్ యార్లగడ్డ శివప్రసాద్ అధ్యక్షతన జరిగిన సభలో సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీపీ కోట విజయరాధిక, స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డిఆర్‌కె.ప్రసాద్, సామాజికవేత్త కంఠంనేని నిరంజనరావు, ప్రిన్సిపాల్స్ పెమ్మసాని రమేష్‌బాబు, షేక్ అబ్దుల్ రహీం ప్రసంగించారు. పురప్రముఖులు, అధ్యాపకులు పాల్గొన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లి దండ్రులను సత్కరించి నగదు బహుమతులు, జ్ఞాపికలు అందజేశారు.

బందరులో ఆక్రమణల తొలగింపు

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : లక్ష్మీటాకీసు సెంటర్‌లో ఆక్రమణలను మున్సిపల్ అధికారులు శుక్రవారం తొలగించారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్న దృష్ట్యా బడ్డీలను తొలగిస్తున్నట్టు కమిషనర్ బాపిరాజు తెలిపారు. ఆక్రమణల తొలగింపు మరో రెండువారాల పాటు కొనసాగుతుందని కమిషనర్ తెలిపారు.

రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుతాం : యామిని శర్మ

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దుదాతామని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి యామిని శర్మ అన్నారు. కృష్ణావిశ్వవిద్యాలయంలో జరిగిన సమావేశంలో యామినిశర్మ మాట్లాడారు. పారిశ్రామికవాడల అభివృద్ధితో పాటు స్కిల్ హబ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిని ఆరు వరుసలుగా నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకరించిందన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, ప్రధాన కార్యదర్శి గాంధీ, అంగడాల సతీష్, పోతిరెడ్డి కృష్ణకాంత్, అయోధ్య రామయ్య తదితరులు పాల్గొన్నారు.



పాగోలులో సహస్ర లింగార్చన చేస్తున్న బంగారుబాబు, విద్యాసాగర్ గురుజీ



చల్లపల్లి పడమర వీధి రామాలయంలో ప్రతిష్ఠా పూజల్లో పాల్గొన్న దంపతులు



పెడన అగస్తేశ్వరస్వామి ఆలయంలో సంప్రోక్షణ నిర్వహిస్తున్న వేదపండితులు

భక్తిశ్రద్ధలతో సహస్ర లింగార్చన

చల్లపల్లి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పాగోలులోని కైవల్యాశ్రమ చలాచల బోధోపదేశ మందిర ప్రాంగణంలోని శ్రీకమలాత్మికా సహిత అచలేశ్వర పంచాయతన ప్రతిష్ఠామహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. మండప పూజ, మూలమంత్ర జపం, దశమహావిద్య అనుష్ఠానం, శ్రీచక్రార్చన, సాయంత్రం దీక్షాహోమం, సహస్ర లింగార్చన, ఆజ్యాహూర్ణాహంతి తదితర పూజలు విద్యాసాగర్ గురుజీ పర్యవేక్షణలో డాక్టర్ వడ్లమాని సుబ్రహ్మణ్య అవధాని, వడ్లమాని కేదారశర్మ నేతృత్వంలో జరిగాయి. ఆలయ ట్రస్టీ మేకా బంగారుబాబు దంపతులు, వక్కలగడ్డ దుర్గాప్రసాద్ దంపతులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు. 23వ తేదీ ఆదివారం ప్రతిష్ఠ చేసేందుకు మేనేజింగ్ ట్రస్టీ చాపరాల గాంధీప్రసాద్, ట్రస్టీ మేకా బంగారుబాబు ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. స్థానిక పడమరవీధి జెండు చెట్టు బజారులో శ్రీరాఘవరపు వెంకట కృష్ణమ్మ జానకి రామాలయం ప్రతిష్ఠామహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. గణపతిపూజ, యాగశాల ప్రవేశం, రక్షోఘ్నం, కలశస్థాపన, మత్సంగ్రహణం, అగ్నిప్రతిష్ఠ, దీక్షాహోమాలు, జలాధివాసం తదితర పూజా కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిగాయి.

నేటి నుంచి పోతురాజు స్వామి జాతర

నాగాయలంక : నాగాయలంకలో కొలువైన పోతురాజు స్వామి జాతర మహోత్సవాలు ఈ నెల 22, 23వ తేదీలలో నిర్వహిస్తున్నట్లు భక్త బృందం తెలిపింది. 22న స్వామివారి ఊరేగింపు, 23న జాతర, భక్తులకు అన్నసమారాధన జరుగుతాయన్నారు.

అగస్తేశ్వరస్వామి ఆలయంలో..

పెడన : అగస్తేశ్వర స్వామి ఆలయానికి అభివృద్ధి కమిటీ సభ్యులు వెండితొడుగు బహూకరించారు. కమిటీ ఛైర్మన్ బళ్ళ ప్రసాద్, సభ్యులు అందజేయగా, శివశ్రీ ఐలూరి జయకిషోర్ నేతృత్వంలో శుక్రవారం సంప్రోక్షణ క్రతువులు నిర్వహించారు. గర్భాలయ ముఖ ద్వారానికి వెండి తొడుగు బిగింపు పనులు చేపట్టారు. వేదపండితులు గూడూరు అగస్త్యయ్య, శివదత్త తదితరులు పాల్గొన్నారు.

భూముల రీ-సర్వే నెలాఖరుకు పూర్తి

చల్లపల్లి,ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రీ సర్వే నెలాఖరు నాటికి పూర్తిచేసే లక్ష్యంతో పనిచేస్తున్నట్లు సర్వే ట్రైనింగ్ అకాడమీ ఏడీ ఎంవి.రంగప్రసాద్ తెలిపారు. వక్కలగడ్డ గ్రామంలో రీసర్వే తీరును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. సర్వే అధికారులకు పలు సూచనలు, సలహాలు అందించారు. రైతులకు నోటీసులు అందించి వారి సమక్షంలో సర్వే నిర్వహిస్తున్నట్లు తెలి పారు. స్థానికంగా లేని రైతుల భూమి సర్వే కొంత ఆలస్యం అవుతోందన్నారు. రైతులు ఇతర ప్రాంతాల్లో ఉన్నప్పటికీ వారికి సమా చారం అందించి వారి సమక్షంలోనే సర్వే పూర్తిచేయాలని ఆదేశించినట్లు చెప్పారు. సర్వే అధికారుల పని తీరు సంతృప్తికరంగా ఉందన్నారు. ఇన్‌చార్జి సర్వేయర్ సిహెచ్. వల్లి పుష్ప, రీ సర్వే డీటీ నీలిమ, వీఆర్వో ప్రతిమ, సర్వేయర్ సాయి, వీఆర్వోలు, సర్వేయర్లు పాల్గొన్నారు. **కోడూరు** : రీ సర్వేలో తప్పిదాలు లేకుండా సమర్థవంతంగా నిర్వహించాలని సీఈవో శ్రీనివాస్ రెడ్డి అన్నారు. పిట్టలంక గ్రామంల రీ సర్వే విధానాన్ని, రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. తహసీల్దార్ శ్రీను నాయక్, డిప్యూటీ రీ సర్వే తహసీల్దార్ పద్మప్రియ, మండల సర్వేయర్ నాగరాజు, సచివాలయ సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. **నాగాయలంక** : టి.కొత్తపాలెం రెవెన్యూ పరిధిలోని మర్రిపాలెం, పెదపాలెం, టి.కొత్త పాలెం గ్రామాలలో మొదటి దశ భూముల రీ సర్వే మార్చి 8వ తేదీ నాటికి పూర్తి చేసేం దుకు కృషి చేస్తున్నట్లు తహసీల్దార్ ఎం. హరనాథ్ తెలిపారు. ముందుగా రైతు లకు నోటీసులు ఇచ్చి ఆయా రైతులకు వారి పొలాలల్లో హ ద్దులు చూపించే కార్యక్రమాన్ని సిబ్బంది ముమ్మరంగా చేశారు. వీఆర్వో లు, గ్రామ సర్వేయర్లు, సిబ్బంది ఎనిమిది బృందాలుగా విభజించి బ్లాకుల వారీగా రీ సర్వే చేస్తున్నట్లు తహసీల్దార్ తెలిపారు. డీటీ అబ్దుల్ రఫీ, సర్వేయర్లు విజయవర్మ, రామకృష్ణబాబు, వీఆర్వోలు, సిబ్బంది సర్వే కొనసాగిస్తున్నారు.



విద్యార్థులకు పరీక్షల భయం ఉండరాదు : దిట్టకవి

మచిలీపట్నం టౌన్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు పరీక్షల భయం పోగొట్టేందుకు పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో మచిలీపట్నంలో ప్రముఖ విద్యావేత్తలు, సైకాలజిస్టుల సహకారంతో కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు ప్రముఖ విద్యావేత్త దిట్టకవి వెంకటేశ్వరరావు అన్నారు. చిన్నాపురం, గుండుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం పదో తరగతి విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, చిన్నాపురంలో 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన ఇద్దరు పేద విద్యార్థులను దత్తత తీసుకుంటామని చెప్పారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ జాయింట్ సెక్రటరీ ముదిగొండ శాస్త్రి, చిన్నాపురం హైస్కూల్ హెచ్‌ఎం జి. ఉదయభాను కుమారి, విజయలక్ష్మి, గుండుపాలెం హెచ్‌ఎం కోటేశ్వరరావు పాల్గొన్నారు.



తెలుగుతేజం పత్రిక ఆవిష్కరణ

పెడన రూరల్, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుతేజం పాఠశాల పత్రికను హెచ్‌ఎం సిద్దినేని సౌజన్య ఆవిష్కరించారు. విద్యార్థుల్లో భాషపట్ల ఆసక్తి, పఠనాసక్తి, రచనాసక్తి పెంపొందించేందుకు పత్రికలు ఉపయోగపడతాయన్నారు. కలిదిండి రాంబాబు, పరిశే రాజేశ్వరరావు, ఎం.పద్మజలను సత్కరించారు.

వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేత్రవైద్యశిబిరం

పెడన, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నేత్ర వైద్యశిబిరాల నిర్వహిస్తున్న జాతీయ అధ్యక్షుడు బండారు ఆనందప్రసాద్ తెలిపారు. పెడనలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. శిబిరంలో 123 మందికి పరీక్షలు నిర్వహించి 49 మందికి కాటరాక్ట్ ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. పిచ్చుక ఫణికుమార్, ఆకురాతి జనార్దన్, బాలాజీ, శివరామప్రసాద్, పిల్లలమర్రి నాగేశ్వరరావు, కట్టా హేమసుందరరావు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

కోడూరు, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : సోదరుడిని కోల్పోయిన బడే భావన్నారాయణ, ఇటీవల మృతి చెందిన టీడీపీ నాయకుడు దావు చిన్నబాబు కుటుంబ సభ్యులను, మాతృమూర్తిని కోల్పోయిన బడే రమేష్‌ను, విశ్వనాథపల్లిలో పితృవియోగానికి గురైన తోట సోమశేఖర్‌ను శుక్రవారం జనసేన నాయకులు మండలి వెంకట్రామ్ పరామర్శించారు. ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, జనసేన మండల పార్టీ అధ్యక్షుడు మర్రె గంగయ్య, కోట రాంబాబు, పూతబోయిన సాయిబాబు, కాగిత రామారావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఖ్య నమోదుపై అవగాహన ర్యాలీ

మోపిదేవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి): రైతు గుర్తింపు సంఖ్య నమోదుపై శుక్రవారం పెదకళ్లేపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. భూమి కలిగిన ప్రతి రైతు విధిగా నమోదు చేసుకోవాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకం వర్తించాలంటే రైతు పేరు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అన్నారు. ఏవో కె.హెప్సిబా రాణి, గ్రామ రైతులు, రైతు సేవా కేంద్రం సహాయక సిబ్బంది ఉన్నారు.

రీ సర్వే రికార్డుల పరిశీలన

పెడన, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : భూహం స్సేన్‌పాలెంలో భూముల రీ సర్వే పూర్తి కావడంతో రికార్డులను ల్యాండ్ అండ్ సర్వే శాఖ అడిషనల్ డైరెక్టర్ గోవిందరావు రికార్డులను పరిశీలించారు. ల్యాండ్ అండ్ సర్వేశాఖ జిల్లా అధికారిణి జోషిలా, ఆర్డీవో ఎం. స్వాతి, తహసీల్దార్ కె. అనిల్‌కుమార్ స్వాగతం పలికారు. సర్వేయర్ దాసు, సర్వే డిప్యూటీ తహసీల్దార్ సల్మా వివరాలను తెలియజేశారు.



శ్రీరామ కొండలరావు భౌతికకాయానికి నివాళులర్పిస్తు ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

బీజేపీ నాయకుడు శ్రీరామ కొండలరావు మృతి

కృత్తివెన్ను, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : పెడన నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పడవల శ్రీరామ కొండలరావు గురువారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. కొండలరావు భౌతికకాయాన్ని ఎమ్మెల్యే కాగి త కృష్ణప్రసాద్, బీజేపీ జిల్లా కార్యదర్శి పుప్పాల రాము సందర్శించి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు ఒడుగు తులసీరావు, కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, నిడమర్రు సర్పంచ్ బస్వాని బంగారాజు, డీసీ వైస్ ఛైర్మన్ బొర్రా ఏడుకొండలు, బీజేపీ సీనియర్ నేత దాసరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బైక్ ఢీకొని ఒకరి మృతి



కృత్తివెన్ను, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : అడ్డపర్ర-సంగమూడి గ్రామాల మధ్య 216 జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అడ్డపర్ర గ్రామానికి చెందిన గార్లపాటి కోటేశ్వరరావు (60) దుర్మరణం చెందాడు. చినగట్టు వద్ద రోడ్డు దాటుతుండగా బైక్ ఢీ కొట్టింది. దీంతో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కోటేశ్వరరావు మృతదేహానికి మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేసి, శుక్రవారం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బైక్ అదుపుతప్పి గాయాలు

మోపిదేవి, ఫిబ్రవరి 21 (ఆంధ్రజ్యోతి) : బైక్ అదు పు తప్పి సైకం పూర్ణచంద్రరావు అనే వ్యక్తికి గాయపడ్డాడు. అవనిగడ్డ వైపు నుంచి మచిలీపట్నం మోటార్ బైకుపై వెళ్తుండగా, మోపిదేవి శివారులోని మంగళవాని శింకు డ్రైన్ వద్ద ఎదురుగా వెళ్తున్న సైకిలిస్టును తప్పించబోయి అదుపు తప్పి ప్రమాదవశాత్తు పడ్డాడు. ఈ ఘటనలో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికుల సమాచారంతో అంబులెన్స్‌లో అవనిగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.